

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 17-02-2023 | సంపుటి : 04 | సంచిక : 153 | పేజీలు : 4 | వెల : రూ 3-00

## కొత్త జిల్లాల్లో పదోన్నతులు, ఖాళీలపై సీఎస్ కీలక ఆదేశాలు



అమరావతి: రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో గ్రామ, వార్డు సచివాలయాలు సహా వివిధ విభాగాల్లో ఖాళీలపై సీఎస్ కేఎస్.జవహర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది రేషనలైజేషన్ లేదా పదోన్నతులు కల్పించుట లేక ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం ద్వారా త్వరితగతిన ఖాళీలు భర్తీ చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.కాగా, గురువారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం ఐదవ బ్లాక్‌లో కలెక్టర్ల మీటింగ్ హాల్‌లో సీఎస్ అధ్యక్షతన కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను మరింత మెరుగుపరచడం, డెలిగేషన్ ఆఫ్ పవర్స్, ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్ 1, 2 పోస్టుల ఖాళీల భర్తీ, ఈ-ఆఫీసు ద్వారా ఈ-రిసీప్ట్స్, ఈ-డిస్పాచ్ ఆపరేషనలైజేషన్, ఏసీబీ, విజిలెన్స్ కేసుల పరిష్కారం, కలెక్టర్లతో వీడియో సమావేశాల్లో వచ్చిన అంశాలపై ఫాలోఅప్ చర్యలు, అసెంబ్లీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివిధ ఎల్ఏక్యూ, ఎల్సిక్యూలపై సత్వరం సమాచారం అందించడం, ఏపీ ఆన్‌లైన్ లీగల్ కేసుల మానిటరింగ్ విధానం తదితర అజెండా అంశాలపై సీఎస్ జవహర్ రెడ్డి కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ జవహర్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్త జిల్లాల్లో గ్రామ, వార్డు



సచివాలయాలు సహా వివిధ విభాగాల్లో ప్రస్తుతం ఉన్న సిబ్బంది రేషనలైజేషన్ లేదా పదోన్నతులు కల్పించాలి. లేనిపక్షంలో ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలు ద్వారా ఖాళీల భర్తీకి వెంటనే చర్యలు తీసుకోవాలి. సచివాలయాల్లో పనిచేస్తున్నఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్‌కు చర్యలు తీసుకోవాలి. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూపు 1, 2 స్థాయి పోస్టుల ఖాళీల వివరాలను వెంటనే సాధారణ పరిపాలన శాఖకు అందజేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ విధానం కింద ఈ-రిసీప్ట్స్, ఈ-డిస్పాచ్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి.త్వరలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్ననేపథ్యంలో అసెంబ్లీ, శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధించిన వివిధ శాఖలు అందించాల్సిన సమాధానాలను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ఏసీబీ, విజిలెన్స్ కేసులను నిరంతరం మానిటర్ చేస్తూ ఆయా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి. అదే విధంగా ఏపీ ఆన్‌లైన్ లీగల్ కేసుల మేనేజ్‌మెంట్ విధానం కింద వివిధ శాఖల్లో నమోదు అవుతున్న కోర్టు కేసుల్లో సకాలంలో కౌంటర్లు దాఖలుచేయడం కోర్టు కేసులపై జాప్యం లేకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. దీనిపై త్వరలో జీపీలు, కార్యదర్శులతో ఒక వర్క్ షాపు నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు.గతంలో నిర్వహించిన ఉద్యోగ సంఘాల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లో ఉద్యోగ సంఘాల నుండి వచ్చిన డిమాండ్లలో ఆర్థికేతర అంశాలకు సంబంధించిన డిమాండ్లను త్వరిత గతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పలు ఇతర అంశాలపై కూడా కార్యదర్శులతో సమీక్షించారు.

## నారా లోకేష్‌పై బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఫైర్

తాడేపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌బాబుపై ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్దార్థ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో టీడీపీకి 2,3 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని సంచలన కామెంట్స్ చేశారు. అవినీతిపై నారా లోకేష్ మాట్లాడటం సిగ్గుచేటు అంటూ వ్యాఖ్యలు చేశారు.కాగా, బైరెడ్డి సిద్దార్థ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏపీలో ఇల్లు కట్టుకుని రాజకీయాలు చేయమని టీడీపీ నేతలే చంద్రబాబుకు చెబుతున్నారు. సీఎం జగన్‌పై లోకేష్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. మంగళగిరిలో గెలవలేని వ్యక్తి పార్టీని అధికారంలోకి తీసుకువస్తాడంటా. లోకేష్ ఒక ఫెయిల్యూర్ పొలిటీషియన్. వచ్చే ఎన్నికల్లో టీడీపీ భారీ ఓటమి చవిచూస్తుంది.ప్రజాన్యాయస్థానంలో గెలిచిన నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సీఎం జగన్‌పై కుట్రలు పన్ని కేసులు పెట్టించారు. సీఎం జగన్ నిత్యం ప్రజల గురించే ఆలోచించే వ్యక్తి. ఉద్దానం సమస్యను పరిష్కారం చూపింది సీఎం జగన్ మాత్రమే. చంద్రబాబులాగా అబద్దపు హామీలు ఇచ్చే అలవాటు మాకు లేదు. ఐదేళ్లలో అన్ని హామీలు నెరవేరుస్తాము. మంత్రి రోజాను మహిళ అని కూడా చూడకుండా ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. ఇది కరెక్ట్ కాదంటూ హెచ్చరించారు. 2014-19లో సిమెన్స్ కంపెనీని వాడుకుని రూ. 250కోట్లు దోచుకున్నది వాస్తవం కాదా?. రూ. 250 కోట్లు ఏవిధంగా మాయమయ్యాయో లోకేష్ చెప్పాలి. సిమెన్స్ కంపెనీతో చేసుకున్న ఒప్పందంపై లోతుగా విచారణ చేయాలి. టీడీపీ శ్రేణులు వాస్తవాలు తెలుసుకోవాలని కోరుతున్నాను. అచ్చెన్నాయుడు కుంభకోణంపై విచారణ జరగకుండా స్టే తెచ్చుకున్నారు. చంద్రబాబు అవినీతిపై వేల పుస్తకాలు వేయొచ్చు.ఎన్నడూ లేనివిధంగా ఏపీలో స్కూల్స్ అన్ని బాగుపడ్డాయి. ప్రతీ గ్రామానికి వైద్య సేవలు అందుతున్నాయి. విత్తనం నుంచి మద్దతు ధర వరకూ రైతులకు అండగా ఉన్నాము. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి.

## అమెరికా అధ్యక్ష రేసులో నిక్కీ హేలీ..

### అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన రిపబ్లికన్ నేత



వాషింగ్టన్: భారతీయ సంతతికి చెందిన నిక్కీ హేలీ.. అమెరికా అధ్యక్ష పదవికి పోటీపడనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అగ్రరాజ్య అధ్యక్ష పదవి రేసులో ఉండేందుకు రిపబ్లికన్ పార్టీ తరపున పేరును ప్రకటించిన తొలి ఇండో అమెరికన్ మహిళగా ఆమె నిలిచారు. 2024లో జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలే లక్ష్యంగా ఆమె తన ప్రచారాన్ని మొదలుపెట్టారు. కొత్త తరం రిపబ్లికన్ నేతల్ని ఆకర్షించనున్నట్లు ఆమె తెలిపారు.గతంలో సౌత్ కరోలినా గవర్నర్ చేశారు నిక్కీ. యునైటెడ్ నేషన్స్ అంబాసిడర్‌గా చేశారామె. భారతీయ వలసవాదులు కూతుర్ని అయినందుకు గర్విస్తున్నట్లు ఆమె తన ప్రకటన సందర్భంగా తెలిపారు. రిపబ్లికన్ పార్టీ భవిష్యత్తు తానే అన్నట్లు ఆమె చెప్పారు. దక్షిణ కరోలినాలో 2500 జనాభా ఉన్న బాంబ్‌బర్గ్ పట్టణానికి తమ తల్లితండ్రులు వలస వచ్చారని, ఆసమయంలో ఇక్కడ ఎవరూ తమకు తెలియదని, కానీ అమెరికాలో బ్రతకడం దీవెనగా భావిస్తున్నట్లు నిక్కీ తెలిపారు.నిక్కీ హెలే పేరెంట్స్‌ది పంజాబ్. 1960 దశకంలో వాళ్లు అమెరికాకు వలస వెళ్లారు. అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ప్రకటించిన నిక్కీ.. తన వీడియోలో ఇండియన్ హెరిటేజ్ గురించి కూడా ప్రస్తావన చేశారు. ఇండియన్ ఇమ్మిగ్రాంట్లకు పుట్టిన బిడ్డను అని, బ్లాక్ కాదు.. వైట్ కాదు.. తాను డిఫరెంట్ అన్నారు. భిన్నత్వాలపై కాదు.. సమానత్వాలపై ఫోకస్ పెట్టాలని తన తల్లి ఎప్పుడూ చెబుతుందని నిక్కీ తన వీడియోలో తెలిపారు.సౌత్ కరోలినాలోని చార్లెస్టన్‌లో జరిగిన సభలో ఆమె తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. అయితే ఆ సభలో ఆమె నేరుగా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ను విమర్శించలేదు. కానీ ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్‌ను ఆమె తప్పుపట్టారు. 75 ఏళ్లు దాటిన నేతలకు మెంటల్ కాంపిటెన్సీ టెస్ట్ నిర్వహించాలని పరోక్షంగా బైడెన్‌పై విమర్శలు చేశారు.

## ఢిల్లీ మద్యం కుంభకోణం కేసు..

### నిందితుల బెయిల్ పిటిషన్ తిరస్కరణ





ఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం మనీలాండరింగ్ వ్యవహారంలో నిందితుల బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరించింది.ఈ కేసులో నిందితులుగా ఉన్న సమీర్ మహేంద్రు, శరత్ చంద్రారెడ్డి, అభిషేక్ బోయినపల్లి, బినోయ్ బాబు, విజయ్ నాయర్‌లు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతుందని, బెయిల్ ఇవ్వొద్దని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఅ) వాదనలు వినిపించింది. తాజాగా సౌత్ గ్రూప్ నుంచి మాగుంట రాఘవ, గోరంట్ల బుచ్చిబాబును అరెస్టు చేశామని.. వీరిచ్చిన సమాచారం ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నామని ఈడీ వివరించింది. నిందితులకు బెయిల్ ఇస్తే ఇతర సాక్షులను, దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని బెయిల్ ఇవ్వొద్దని ఈడీ కోరింది. ఈడీ విజ్ఞప్తి మేరకు నిందితుల బెయిల్ పిటిన్లను కోర్టు తిరస్కరించింది.

## బీజేపీకి కన్నా రాజీనామా

### సోము వల్లే జరిగిందంటున్న కన్నా

విజయవాడ, ఫిబ్రవరి 16,2014లో నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితుడిని అయ్యానని కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. ఆ నాటి నుంచి పార్టీలో ఏ బాధ్యత అప్పగించినా ఓ కార్యకర్త తరహాలో పని చేసుకుంటూ వచ్చానని గుర్తు చేసుకున్నారు. తన పనిని గుర్తించి 2018లో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యత ఇచ్చారని అన్నారు. 2019 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయాలని, మోదీ నాయకత్వంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేశానని అన్నారు. మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు కూడా బీజేపీలో చేరారని అన్నారు. సీఎం జగన్ తీసుకున్న 3 రాజధానులకు వ్యతిరేకంగా అమరావతి ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నామని అన్నారు. ప్రజా వ్యతిరేక ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాడామని అన్నారు. మోదీ అంటే జీవితకాల అభిమానం ఉన్నప్పటికీ పార్టీలో ఇమడలేకపోయానని అన్నారు." "సోము వీర్రాజు ప్రవర్తన నచ్చకే పార్టీని వీడుతున్నా. ఆయన వల్లే పార్టీలో ఇమడలేకపోయా. పార్టీతో చర్చించకుండా జీవీఎల్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. రంగా పేరు క్రిష్ణా జిల్లాకు పెట్టాలని గతంలోనే ఉద్యమం చేశాం. అప్పుడే జీవీఎల్ ఉద్యమంలో పాల్గొంటే బాగుండేది. కొందరు ఓవర్ నైట్ స్టార్ నేత కావాలని ప్రయత్నిస్తున్నారు. సోము వీర్రాజు అధ్యక్షుడు అయ్యాక పార్టీలో పరిస్థితులు మారాయి" "



-కన్నా లక్ష్మీ నారాయణ

సోము తప్పేమి లేదంటున్న జీవీఎల్

సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు బీజేపీ తగిన ప్రాధాన్యం ఇచ్చిందని ఎంపీ జీవీఎల్ నరసింహారావు వ్యాఖ్యానించారు. రాజీనామా చేస్తున్నట్లుగా కన్నా ప్రకటించిన తర్వాత జీవీఎల్ మొదట తానేమీ స్పందించబోనని.. పార్టీ తరపున స్పందన వస్తుందని ప్రకటించారు. కానీ కాసేపటికే ప్రెస్ మీట్ పెట్టి కన్నా విషయంలో స్పందించారు. కన్నా లక్ష్మీనారాయణ రాజీనామాపై తమ అధిష్టానంతో మాట్లాడినట్టు జీవీఎల్ చెప్పారు. ముఖ్యంగా రాజీనామాకు ఏపీ బీజేపీ చీఫ్ సోము వీర్రాజే వైఖరే కారణమని, ఆయన ప్రవర్తన నచ్చలేదని కన్నా అనడంపై జీవీఎల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కన్నా వ్యాఖ్యలు రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నవని విమర్శించారు. సోము వీర్రాజుపై కన్నా వ్యాఖ్యలు సమర్థనీయం కాదన్నారు. సోము వీర్రాజు తీసుకున్న ప్రతి నిర్ణయం అధిష్టానం ఆదేశాల మేరకేనని తెలిపారు. కన్నా లక్ష్మీనారాయణకు తమ పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు.సాధారణంగా ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు వెంటనే రాష్ట్ర బాధ్యతలు అప్పగించదని..కానీ కన్నా విషయంలో అలా జరగలేదన్నారు. ఆయనకు రాష్ట్ర నాయకత్వ బాధ్యతల్ని అధిష్టానం ఇచ్చిందన్నారు. ఆ తర్వాత జాతీయ కార్యవర్గంలోకి తీసుకుందని జీవీఎల్ గుర్తు చేశారు. ఎవరి వ్యక్తిగత అభిప్రాయాలు వారివని, అధిష్టానంతో సంప్రదించాకే ఈ వ్యాఖ్యలు చేస్తున్నానని జీవీఎల్ తెలిపారు.

## తెదేపాలో కొత్త వ్యవస్థ.. ప్రకటించిన చంద్రబాబు

జగ్గంపేట: తెదేపాలో కుటుంబ సాధికార సారథుల పేరిట కొత్త వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నామని ఆ పార్టీ అధినేత చంద్రబాబు వెల్లడించారు.ప్రతి 30 కుటుంబాలకు సాధికార సారథులను నియమిస్తామని చెప్పారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా కాకినాడ జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబు.. జగ్గంపేటలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తెదేపా అధికారంలో ఉన్నప్పుడు న్యాయం చేయలేకపోయామని.. ఈసారి అలా జరగకుండా పక్కా వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఇకపై పార్టీలో ఉన్న సెక్షన్ ఇన్‌ఛార్జ్‌లందరినీ కుటుంబ సాధికార సారథులుగా పిలుస్తామన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించేలా వీళ్లు పనిచేస్తారని వివరించారు. సాధికార సారథులుగా మహిళలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారథి విభాగం ఉంటుందని చెప్పారు. ప్రతి కుటుంబానికీ న్యాయం చేసేందుకు ఈ విభాగం పనిచేస్తుందని చంద్రబాబు తెలిపారు.



## జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే వైఎస్ వివేకా హత్య

### టీడీపీ నేత, చింతకాయల అయ్యన్న పాత్రుడు

విజయవాడ ఫిబ్రవరి 16 సీఎం జగన్మోహన్ రెడ్డి పై టీడీపీ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే వైఎస్ వివేకా హత్య జరిగిందని ఆరోపించారు. బాబాయిని చంపడానికి ఎంపీ టిక్కెట్ కారణమని పేర్కొన్నారు. ఈ కేసులో విజయసాయిరెడ్డి ని కూడా సీబీఐ విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. తన తప్పులు బయటపడుతుంటే సీఎం జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కోడికత్తి కేసు నాలుగేళ్లు అయినా ఎందుకు విచారణ సాగుతోందని ప్రశ్నించారు. ఏపీ రాజధాని విషయంలో ముఖ్యమంత్రి తుగ్లక్ నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. అసలు ఏపీకి సీఎం జగన్‌రెడ్డా..? సజ్జల రామకృష్ణారెడ్డా? అని అయ్యన్న పాత్రుడు ప్రశ్నించారు.వివేకానంద రెడ్డి హత్యను జగన్ రెడ్డి ఆనాడు చంద్రబాబు కు ఆపాదించారని, అవినీతి పత్రికలో విషం కక్కారని అయ్యన్న పాత్రుడు దుయ్యబట్టారు. జగన్ అధికారంలోకి వచ్చాక హత్య కేసు మాఫీ చేయాలని చూశారని.. ఇప్పుడు సీబీఐ విచారణలో వాస్తవాలు బయటకి వస్తున్నాయన్నారు. రక్తపు మడుగులో ఉంటే విజయసాయి రెడ్డి గుండె పోటు అని ఎలా చెప్పారని ప్రశ్నించారు.



# సంపాదకీయం

శుక్రవారం 17-02-2023

## గూగుల్ వర్సెస్ చాట్ జీపీటీ

టెక్నాలజీ వార్ ఇది. ఏఐతో అంతర్జాలంలో టెక్ దిగ్గజాల మధ్య వచ్చిపడ్డ పోటీ ఇది. సరికొత్త ఏఐ ఛాట్‌బోట్ విపణిలో సంచలనాత్మక సంగతులివి. మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడి పెట్టిన 'ఓపెన్ ఏఐ' సంస్థ సృష్టి 'ఛాట్ జీపీటీ'దే నేటిదాకా హవా. ఇప్పుడు ఆ యాంత్రిక ఛాట్‌బోట్ సర్వీస్‌కు పోటీగా మరో దిగ్గజం గూగుల్ తనదైన ఛాట్‌బోట్ 'బార్డ్'ను తెస్తున్నట్టు ప్రకటించింది. దీంతో కథ మలుపు తిరిగింది. మరోపక్క ఈ ఛాట్‌బోట్ టెక్నాలజీతోనే మరింత పదును తేలిన సెర్చ్ ఇంజన్‌గా మునుపటి తమ 'బింగ్'ను ముందుకు తేనున్నట్టు మైక్రోసాఫ్ట్ తెలిపింది. వెంటనే గూగుల్ సైతం సెర్చ్ ఇంజన్‌గా తన ఆధిక్యాన్ని నిలబెట్టుకొనేందుకు ఏఐ ఫీచర్లతో సై అంటోంది. ఇంటర్ నెట్ లో పెరుగుతున్న పోటీకీ, టెక్ దిగ్గజాల పోరుకూ ఇది దర్పణం. ఆధునిక ఏఐ సాంకేతికత ఆవిర్భావం, పోటాపోటీ ఒక రకంగా మంచిదైతే, మరోరకంగా చెడ్డది. అనేక ఇతర సాంకేతిక విప్లవాల లానే దీనివల్లా కొత్త ఉద్యోగాలొస్తాయి. కొన్ని పాతవి పోతాయి. ఏఐతో ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు సహా అనేక అంశాల్లో మానవ సామర్థ్యం పెరగవచ్చు. తరగతిలో వేర్వేరు అవగాహన స్థాయుల్లో పది మంది ఉంటే, ఒకే పాఠం ఎవరి స్థాయికి తగ్గట్టు వారికి అర్థమయ్యేలా అందించడం లాంటి మామూలు మేళ్ళు సరేసరి. అయితే, సంభాషణాత్మక ఛాట్‌బోట్ సర్వీస్‌లు సమస్యలకు సమాధానాలివ్వడంతో పాటు సొంతంగా కథలు, కవితలు అల్లగలగడం సృజనాత్మకతకూ సవాలే. ఇలా సమాజాన్నే మార్చేసే సవాలక్ష అంశాలతో తలెత్తే నైతిక, సామాజిక, తాత్త్విక ప్రశ్నలెన్నో. మానవజాతి మేలుకు వాడాల్సినదాన్ని దుర్వినియోగం చేస్తేనే ప్రమాదం. దీనిపై ప్రపంచ వ్యాప్త పర్యవేక్షణ ఎలా అన్నది చూడాలి. సాక్షాత్తూ 'ఛాట్ జీపీటీ' సృష్టికర్తలే ప్రభుత్వాల నియంత్రణ కోరుకుంటున్నారు. వెరసి, అంతర్జాలంలో కృత్రిమ మేధ ఆధారంగా కనివిని ఎరుగని పోటాపోటీ వాతావరణం నెలకొందికృత్రిమ మేధతో సాగే ఈ పనిముట్లతో మానవాళికి కలిగే మేలు, కీడులపై చర్చ ఊపందుకుంది. సంక్లిష్ట అంశాల్ని అరటిపండు ఒలిచి నోట్లో పెట్టినట్టు చెప్పడానికి కృత్రిమమేధతో నడిచే ఈ ఛాట్‌బోట్స్ ఉపకరిస్తాయన్నది ప్రాథమిక ఆలోచన. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన 'ఛాట్ జీపీటీ' అలా నూత్నపథగామి అయింది. 2 నెలల్లో 10 కోట్ల యూజర్లతో సంచలనమైంది. శాన్‌ఫ్రాన్సిస్కోలో 375 మంది ఉద్యోగుల చిన్న స్టార్టప్ 'ఓపెన్ ఏఐ' 30 బిలియన్ డాలర్ల విలువైనదైంది. దీంతో, పోటీగా 'బార్డ్'ను తేవడంలో గూగుల్ తొందరపడక తప్పలేదు. నిజానికి, గూగుల్ బృందపు ఆరేళ్ళ శ్రమ ఫలితం 'బార్డ్'. తద్వారా ప్రపంచ విజ్ఞానాన్ని సంభాషణల పద్ధతిలో జనానికి సులభంగా అందిస్తామన్నది గూగుల్ మాట. తీరా ప్రయోగదశలో 'బార్డ్'కు బాలారిష్టాలు తప్పలేదు. గూగుల్ స్వీయ ప్రచార ప్రకటనలోనే 'బార్డ్' కొన్ని జవాబులు తప్పు చెప్పినట్టు' వార్తాసంస్థ పట్టుకొనేసరికి గగ్గోలు మొదలైంది. ప్యారిస్‌లో ఆ సర్వీస్‌ను మార్కెట్‌లోకి ప్రవేశపెట్టే సంరంభానికి కొద్ది గంటల ముందే ఆ లోటుపాట్లు బయటపడ్డాయి. దీంతో ఒకపక్క మైక్రోసాఫ్ట్ షేర్ల ధరలు పెరిగితే, మరోపక్క గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ షేర్లు ఒక్క బుధవారమే 7.8 శాతం పడిపోయాయి. 100 బిలియన్ డాలర్ల మేర నష్టం వాటిల్లింది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ జేమ్స్ వెబ్‌స్పేస్ టెలిస్కోప్ గురించి 'బార్డ్' తప్పు చెప్పడం ఒకరకంగా గూగుల్‌కు తలవంపులే. కాకపోతే, ఈ ఛాట్‌బోట్ సేవల్ని ఇంకా ప్రజా వినియోగానికి పెట్టలేదు గనక ఫరవాలేదు. అందు బాటులోకి తెచ్చే ముందు ప్రత్యేక పరీక్షకులతో క్షుణ్ణంగా పరీక్షలు జరిపిస్తామంటోంది గూగుల్. నిజానికి ప్రపంచవ్యాప్తంగా ఆన్‌లైన్ సెర్చ్‌లో గూగుల్‌దే ఆధిపత్యం. ఏ సమాచారం కావాలన్నా 'గూగులమ్మను అడుగు' అనేది ఆధునిక జనశ్రుతి. ఈ ప్రాచుర్యంతో గూగుల్‌కు నిరుడు వాణిజ్య ప్రకటనల ద్వారా 100 బిలియన్ (10 వేల కోట్ల) డాలర్ల ఆదాయం వచ్చిపడింది. అయితే, 'ఏఐ'ను ఆసరాగా చేసుకొని విజృంభిస్తున్న ప్రత్యర్థి మైక్రోసాఫ్ట్‌తో గూగుల్ పీఠం కదులుతోంది. మైక్రోసాఫ్ట్ తమ సెర్చ్ ఇంజన్ 'బింగ్'ను సైతం సరికొత్త ఫీచర్స్‌తో తీర్చిదిద్ది, గూగుల్‌కు గట్టి పోటీ ఇవ్వ నున్నట్టు ఈ వారమే యుద్ధభేరి మోగించింది. వెంటనే ఫిబ్రవరి 8న గూగుల్ సైతం జనరేటివ్ ఏఐ అనుసంధానిత ఫీచర్లతో తమ సెర్చ్ ఇంజన్ ఫలితాల్ని మెరుగుపరుస్తామని చెప్పాల్సి వచ్చింది. 'బార్డ్'ను తెచ్చిన రెండ్రోజులకే గూగుల్ ఈ రెండో ప్రకటన చేయాల్సివచ్చింది. వ్యాపార కార్యకలాపాలలో ఏఐ వ్యవస్థలను జొప్పించడానికీ, తద్వారా ఉద్యోగుల స్థానంలో అవే పనిచేయడానికీ చాలాకాలమే పట్టవచ్చు. ఈలోగా గ్రంథచౌర్యాలు, తప్పుడు పరిష్కారాలు తలెత్తే ప్రమాదమైతే ఉంది. అందుకే, అమెరికాలో కొన్ని స్కూళ్ళలో ఛాట్ జీపీటీని నిషేధించారు. అయితే, కాలప్రవాహంలో ఏ సాంకేతిక పురోగతినైనా స్వాగతించాల్సిందే. అడ్డుకోవాలని చూస్తే ఆగదు, అందువల్ల ప్రయోజనమూ లేదు. దశాబ్దాల క్రితం కంప్యూటర్ విషయంలో భయపడడం లాంటిదే ఇదీ. కానీ, జీవితంలో భాగమయ్యే కొత్త సాంకేతికత సక్రమంగా, బాధ్యతాయుతంగా వినియోగమయ్యేలా చూసుకోవాలి. విలువలకు తిలోదకాలివ్వకుండా అప్రమత్తం కావాలి. ఇప్పటికే సమాజంలో డిజిటల్ విభజనతో పెరిగిపోతున్న అసమానతలకు ఎలా అడ్డుకట్ట వేయాలో ఆలోచించాలి. యంత్రాన్ని సృష్టించిన మనిషికి, ఆ యాంత్రిక కృత్రిమ మేధే ప్రత్యామ్నాయం కావడం సమా జానికే సవాలన్నది నిజమే కానీ మనిషికి ఇవి మహత్తర క్షణాలు. టెక్నాలజీని మనిషి తీర్చిదిద్దితే, ఆ టెక్నాలజీయే మళ్ళీ మనిషిని తీర్చిదిద్దే కీలక ఘట్టం. వెల్కమ్ టు ది న్యూ ఏఐ వరల్డ్!

# రాజధాని రాజకీయ క్రీడ...

విజయవాడ, ఫిబ్రవరి 16, ఏపీ ప్రజల కష్టం ఇంకెవరికీ రాకూడదేమో అనిపిస్తోంది. అంటే ప్రతీ రాష్ట్రంలో ఉన్నట్లుగా రోడ్ల ఇబ్బందులు, నీటి కష్టాలు, రైతుల సమస్యలు, అప్పుల భారం ఇలాంటివి మాత్రమే కాదు. వీళ్లకు రాజధాని కూడా ఓ కష్టమే. మూడేళ్లుగా రాజధాని ఏదన్న దానిపై ఏ క్లారిటీ లేదు. ఇప్పుడు మూడు రాజధానులు కూడా మూణ్నాళ్ల ముచ్చట అవుతుందా అనిపిస్తోంది. ఈ మధ్య కాలంలో రాజధాని విషయంలో ముఖ్యమంత్రి మాట్లాడిన మాటలు... ప్రభుత్వంలోని సీనియర్ మంత్రులు చేస్తున్న ప్రకనలు.. వాటికి కౌంటర్లుగా మళ్లీ కొందరు మంత్రులు.. ముఖ్యులు .. సలహాదార్లు ఇస్తున్న వివరణలు.. ఇవన్నీ చూస్తుంటే.. అలాగే ఉంది. రాజధాని అన్నది ఏ రాష్ట్రానికైనా ఓ చిరునామా. గ్రోత్ ఇంజన్.. అదే ముఖ్యనగరం. విభజన తర్వాత ఏపీకి అది ఇంకా ముఖ్యమైంది. అలాంటి రాష్ట్రానికి అమరావతి అని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి ప్రభుత్వాధినేత కూడా అప్పుడు మద్దతిచ్చారు. ఎన్నికల వరకూ అమరావతే రాజధాని అన్నారు. ఎలక్షన్ తర్వాత "విధానాలు" మారిపోయాయి. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా మూడు రాజధానుల అంశం ముందుకొచ్చింది. ఇప్పటివరకూ అమరావతి లో ఉంటున్న పరిపాలనా రాజధాని విశాఖకు... ఇక్కడే ఉన్న హైకోర్టును కర్నూలుకు.. అసెంబ్లీని అమరావతికీ అని చెప్పారు. ఆ తర్వాత చట్టం చేయడం.. మండలిలో వీగిపోవడం.. ప్రభుత్వం మండలి రద్దుకు వెళ్లడం .. మళ్లీ వెనక్కి రావడం.. మూడు రాజధానుల చట్టాన్ని ఉపసంహరించుకోవడం.. అయినా కానీ మూడుకే మా మద్దతూ అంటూ ప్రకటించడం..చకచకా జరిగిపోయాయి. కోర్టుల్లో ఎదురు దెబ్బలు తగిలినా .. అసెంబ్లీలో వెనక్కు తగ్గినా .. మూడు రాజధానుల విధానం నుంచి వెనక్కు మళ్లలేదు అని ప్రభుత్వం అనేక సందర్భాల్లోనూ అసెంబ్లీలోనూ ప్రకటించింది. కాబట్టి బిల్లులో పెట్టినట్లుగా సుప్రీంకోర్టు ఒప్పుకుంటే మూడు ప్రాంతాలకూ మూడు రాజధానులు వస్తాయన్నది సామాన్య ప్రజలకు ఉన్న అవగాహన. ఇక వైస్సార్సీపీ ఇచ్చిన సంకేతాలను బట్టి కోర్టు తీర్పు అనుకూలంగా రాకపోయినా సరే.. ముఖ్యమంత్రి తన నివాసాన్ని మార్చేసుకుంటారిని ఆయన ఎక్కడుంటే అదే రాజధాని అని కూడా ప్రకటనలు వచ్చాయి. విశాఖకు చెందిన మంత్రి అమరనాథ్ రాజెక్కడ ఉంటే అదే రాజాధాని అని ప్రకటించేశారు కూడా..ఇదిలా ఉంటే వరుస బట్టి జరుగుతున్న పరిణామాలు అనేక సందేహాలకు తావిస్తున్నాయి. విశాఖ వేదికగా వచ్చే మార్చి 3,4 తేదీల్లో పెద్ద ఎత్తున గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సన్నాహకంగా ప ఏపీలోని పట్టుబడుల ప్రోత్సాహక వాతావరణాన్ని ప్రమోట్ చసేందుకు పారిశ్రామిక వేత్తలతో రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఈ మధ్య ఢిల్లీలో జరిగిన రోడ్ షోలో ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి వైజాగ్ రాజధాని అని ప్రకటించేశారు. తాను త్వరలో అక్కడకు వెళ్లిపోతున్నా అని కూడా చెప్పేశారు. దాంతో మూడు రాజధానుల కథ ఏమవుతుందో అన్న సందేహాలకు ఫుల్ స్టాప్ పడింది. అయితే ముఖ్యమంత్రి ఆ సమావేశంలో తమ కలల నినాదం మూడు రాజధానుల గురంచి మాటమాత్రమైనా మాట్లాడలేదు. వైజాగ్ గురించి మాత్రమే మాట్లాడారు. పైగా వైజాగ్ రాజధాని అన్నారు కానీ పరిపాలనా రాజధాని అని స్పష్టంగా చెప్పలేదు. అయినప్పటికీ.. అది సాధారణంగా చెప్పిన విషయం.. పరిపాలనా రాజధాని అయినా రాజధాని అయినా ఒకటే కదా అని కొంత మంది విశ్లేషించగా.. మిగతా రాజధానుల గురించి చెప్పకపోయినా అవి లేవు అని కాదు కదా.. అని కొంతమంది మాట్లాడుకున్నారు. అయినా ముఖ్యమంత్రి మాటలతోనే కొంత సందిగ్ధత మొదలైంది. మంగళవారం బెంగళూరులో నిర్వహించిన మరో రోడ్ షోలో ఆర్థిక మంత్రి బుగ్గన మరింత మెటీరియల్ జోడించారు. మూడు రాజధానులు అంటూ ఏం లేవు. వైజాగే ముఖ్యం అన్నట్లుగా మాట్లాడారు. రాష్ట్రం కన్నా విశాఖ గురించే ఎక్కువగా ప్రమోట్ చేశారు. మిగతా రాజధానుల ప్రాధాన్యతను తగ్గించడం మాత్రమే కాదు. బుగ్గన మాటల్లో మరో రెండు ముఖ్యమైన విషయాలున్నాయి. కర్నూలుకు హైకోర్టును పూర్తిగా తరలిస్తున్నట్లుగా ప్రభుత్వం అసెంబ్లీ బిల్లులో ప్రస్తావించింది. కానీ బుగ్గన మాత్రం హైకోర్టు ప్రిన్సిపల్ బెంచ్ మాత్రమే అక్కడ ఉంటుంది అంటన్నారు. ప్రిన్సిపల్ బెంచ్ ఎక్కడ ఉంటే అదే హైకోర్టు అయినప్పటికీ.. మిగతా ప్రాంతాల్లో కూడా బెంచ్ లు ఉంటాయన్నది కొత్త విషయం. ఇక గుంటూరు లో ఓ సెషన్ అసెంబ్లీ సమావేశాలు పెడతాం అన్నారు. అంటే శాసన రాజధానిగా అన్ని అసెంబ్లీ సెషన్లు అక్కడే జరుగుతాయన్న అభిప్రాయం ఇప్పటిదాకా ఉంది. కానీ ఇప్పుడు కేవలం ఒకటే సెషన్ అంటున్నారు. జనరల్ గా అసెంబ్లీకి ప్రతి ఏడాది మూడు సెషన్లు జరుగుతాయి. వీటిలో బడ్జెట్ సెషన్ దాదాపు నెలరోజులు ఉంటుంది. అదేముఖ్యమైనది. మంత్రి వ్యాఖ్యలను బట్టి మూడు ప్రాంతాల్లో మూడు సెషన్లు జరుగుతాయి అనుకోవాలి. మరి అమరావతిలో ఏ సెషన్ జరుగుతుందో.. ఇక్కడ ఇంకో విషయం కూడా ఉంది. గుంటూరు లో అసెంబ్లీ అన్నారు కానీ అమరావతి అనలేదు. అమరావతి కూడా గుంటూరు జిల్లాలోనే ఉంది కాబట్టి .. బహుశా ఆ ఉద్దేశ్యంతో అన్నారా.. లేక అమరావతిలో ఏ కార్యక్రమం చేసే ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం లేదా అన్న సందేహాలు కూడా వస్తున్నాయి. ఇందులో కూడా ఓ ముఖ్యమైన పాయింట్ గుర్తించాలి రాజధాని విషయంలో ఏపీ నిజంగానే ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కొంటోంది. రాజధాని ఏది అని బయట వారు అడిగితే అమరావతి అని చెప్పడానికి ఈ ప్రభుత్వంలో ఎవరికీ మనస్కరించడం లేదు. అమరావతి అని పేరునే ఉచ్చరించడం లేదు. అలాగే విశాఖ అని ఇప్పటికిప్పుడు చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. ముఖ్యంగా ఇన్వెస్టర్స్ సమ్మిట్ లాంటి సమయంలో అది ఇబ్బందికరమైన పరిస్థితే. అందుకనే రాజధాని విశాఖనే అనే ఓ సూత్రీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా ఉంది. రాజకీయ వర్గాల్లో కూడా దాదాపు ఇదే అభిప్రాయం ఉంది. పేరుకు మూడు రాజధానులు అని చెప్పినా.. విశాఖనే అసలైన రాజధానిగా గుర్తిస్తారు అన్న అభిప్రాయం అంతర్గతంగా ఉంది. ఈ కోణంలో చూస్తే.. ముఖ్యమంత్రి జగన్, బుగ్గన రాజేంద్రనాథ్ మాటలు యాథృచ్చికం కాదు అనుకోవాలి. క్రమంగా రాజధాని విశాఖనే అని.. మిగిలిన వాటి ప్రాధాన్యత లేదు అన్నట్టుగా కూడా ఉంది.ఇదంతా ఎందుకు అంటే .. అసలు మూడు రాజధానులు అన్న కాన్సెప్టే కొత్త గా ఉంది. మూడు ప్రాంతాల అభివృద్ధి అన్నది సరే కానీ.. మూడు రాజధానులు ఏంటి అన్న ప్రశ్న బయట ఉంది. అలాగే మూడు రాజధానులు అనే పేరుతో కోర్టు కేసుల్లో నెగ్గడం కూడా కష్టంగానే ఉంది. అసలు ఆ నగరాలకు రాజధాని అనే గుర్తింపు ఉంటుందా అన్నది కూడా సందేహమే.. అందుకే క్రమక్రమంగా రాజధానులు అని పేరువైపు నుంచి అక్కడ ముఖ్యమైన ఇనిస్టిట్యూషన్ లు ఇచ్చాం.. జనబాహుళ్యంలో రాజధానిగా గుర్తింపు ఉంటుంది అన్న డైవర్షన్ వైపు జనాలను మళ్లిస్తున్నట్లుగా కనిపిస్తోంది. అమరావతి రాజధానిగా ఈ ప్రభుత్వానికి నచ్చలేదు అన్నది స్పష్టం. అయితే రాజధానిగా మాత్రమే కాదు. మిగతా విషయాల్లోనూ అమరావతిని ప్రమోట్ చేయడం లేదు. పారిశ్రామిక వేత్తల సదస్సులో కూడా అమరావతి అనే ఓ నగర నిర్మాణం జరుగుతోంది అని కానీ.. అక్కడ అభివృద్ధి చేసిన ప్రభుత్వ భూమి వేల ఎకరాల్లో ఉంది అని కానీ మాటమాత్రంగా కూడా చెప్పడం లేదు. అమరావతి రాజధానిగా పనికి రాదు సరే.. ఇతర అవసరాల విషయంలో ఎందుకు ప్రస్తావించడం లేదు. అమరావతి లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలరకు అవకాశం ఉందని ప్రభుత్వమే ఇంతకు ముందుకు ప్రకటించింది. మరి ఇన్వెస్టర్ మీట్ లో అమరావతి ని ఎందుకు ప్రమోట్ చేయడం లేదు. హైకోర్టు కర్నూలుకు మారుస్తున్నాం.. అన్ని ప్రకటనలు తప్ప.. దానిపై కార్యాచరణ కూడా లేదు. హైకోర్టు అయినా బెంచ్ అయినా వేరే చోటకు మార్చాలంటే.. సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలి. దీనిపై ఇంతవరకూ రాష్ట్రం నుంచి అధికారిక లేఖ సుప్రీంకోర్టుకు చేరలేదు. దీనికి అసలు అసెంబ్లీ బిల్లుతో కూడా సంబంధం లేదు. పైగా ఈ మధ్య మరో కేసులో జవాబిస్తూ.. హైకోర్టు అమరావతిలోనే ఉంటుందని చెప్పారు.ఓ పక్క ఇది జరుగుతుంటేనే ప్రభుత్వంలోని కీలకమైన నేత, మంత్రి ధర్మాన ప్రసాదరావు.. మాకు విశాఖ రాజధాని ఇవ్వకపోతే మా ప్రాంతాన్ని విడగొట్టండి అన్నారు. ఇన్ని వ్యాఖ్యలు.. ప్రకటనల మధ్య ఏం జరుగుతుందో అన్న సందేహాలు ఉంటే.. తాజాగా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి అంబటి రాంబాబు తాము మూడు రాజాధానులకే కట్టుబడి ఉన్నాం.. అని చెప్పడం అసలు హైలైట్. బుగ్గన మాట్లాడిదాంట్లో తప్పు లేదు అని.. మూడు రాజధానులనే మరో రూపంలో చెప్పారు అని సజ్జల సెలవిచ్చారు. పేరు లేకపోయినా అవి రాజధానులే అన్నారు. అదేంటో మరి తెలీదు. అందుకే చెప్పుకున్నాం కదా.. ప్రజలు ఓ మాదిరిగా కూడా కనిపిచడం లేదా.. అని..!

## టీడీపీ గూటికి శైలజానాథ్



అనంతపురం, ఫిబ్రవరి 16, టీడీపీ నుంచి టికెట్ ఆశించే వారి సంఖ్య మాత్రం పెరిగిపోతోంది. అధినేత సైతం ఎవరైతే బాగుంటారనే సర్వేలు నిర్వహిస్తోంది. ఆ సర్వేల్లో కాంగ్రెస్ నుంచి చేరబోయే ఓ నేత టాప్‌లో ఉన్నారట. ఆ విషయం తెలిసి ఆ నాయకుడు ఇంకా దూకుడు పెంచారట.దేనికైనా టైం రావాలంటారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో టీడీపీకి ఆ టైమ్ వచ్చిందన్నది తెలుగు తమ్ముళ్ల మాట. కేడర్ బలంగా ఉన్నా వాళ్లను నడిపించే బలమైన నాయకుడే లేడు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన బండారు శ్రావణికే కొన్నాళ్లు ఇంఛార్జ్ పగ్గాలు అప్పగించారు. ఆమె సారథ్యాన్ని వ్యతిరేకిస్తూ గొడవలు జరగడంతో టూమెన్ కమిటీ వచ్చింది. నర్సానాయుడు, కేశరెడ్డితో ఆ కమిటీ వేసినా.. ప్రస్తుతం కమిటీలో వీరిద్దరికీ పడటం లేదని తెలుస్తోంది. ఇంతకీ శ్రావణిని ఇంచార్జ్‌గా ఉంచారా లేదా అన్నది కేడర్‌కు క్లారిటీ లేదు. శింగనమల ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైనా.. ఇక్కడ టీడీపీని నడిపేది ఓసీ నేతలే అనే ముద్ర పడింది.మూడున్నరేళ్లుగా శింగనమల టీడీపీలో గొడవలే గొడవలు. నియోజకవర్గాల్లో పరిస్థితులు తెలుసుకొనేందుకు వన్ టు వన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు టీడీపీ అధినేత. శింగనమల విషయంలో అదే చేశారు. టూమెన్ కమిటీని, బండారు శ్రావణిని వేర్వేరుగా పిలిచి మాట్లాడారు. అదే సమయంలో టీడీపీ టికెట్ ఎవరికి ఇస్తే బాగుంటుంది అని టూమెన్ కమిటీని ప్రశ్నించారట పార్టీ అధినేత. ఆ సందర్భంగా ఏపీసీసీ మాజీ చీఫ్, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌తోపాటు ఓ రిటైర్డ్ న్యాయమూర్తి పేర్లు చర్చల్లోకి వచ్చాయట.ఇప్పటివరకు శింగనమలలో ఉన్న టీడీపీ నేతలు ఓ ఎత్తు.. శైలజానాథ్ రాకతో మరో ఎత్తు అన్నట్టు ప్రచారం సాగుతోంది. శైలజానాథ్ టీడీపీలోకి వస్తున్నారని చాన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. ఆయన మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. గతంలో ఇదే శింగనమల నుంచి ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి మంత్రిగా పనిచేశారు కూడా. నియోజకవర్గంపై గ్రిప్ ఉండటంతో.. కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారట. అయితే పీసీసీ చీఫ్ అయిన తర్వాత శింగనమలను శైలజానాథ్ పెద్దగా పట్టించుకోలేదనే అభిప్రాయం ఉంది. పీసీసీ చీఫ్ పదవి కోల్పోయాక.. ఆయన దృష్టంతా నియోజకవర్గంపైనే ఉంది. ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో అందరినీ పలకరిస్తున్నారట. టీడీపీ అధినేత కూడా శింగనమలపై మూడునాలుగు సర్వేలు చేశారట. ఎవరిని అభ్యర్థిగా నియమించాలో లెక్కలు వేసుకున్నారట.అన్నీ అనుకున్నట్టు జరిగితే మార్చిలో శింగనమల టీడీపీకి కొత్త ఇంఛార్జ్ వస్తారని.. అలా వచ్చిన ఇంఛార్జే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని చెబుతున్నారు. టీడీపీ టికెట్ రేస్‌లో శైలజానాథ్ ముందు వరసలో ఉన్నారట. ఆయన కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరకపోయినా.. అది లాంఛనమే అనేది స్థానిక తెలుగు తమ్ముళ్ల మాట. మరి.. శింగనమల టికెట్ మాజీ మంత్రికి ఇస్తారో లేక గత ఎన్నికల్లో ఓడిన శ్రావణినే ఎంపిక చేస్తారో.. వీళ్లెవరూ కాదని మాజీ న్యాయమూర్తిని పిలిచి పట్టం కడతారో చూడాలి.

## శ్రీ సిటీ నుంచి వందేభారత్ భాగాలు

తిరుపతి, ఫిబ్రవరి 16, శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా పరిశ్రమ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు ఫైబర్ రీఇన్‌ఫోర్స్ ప్లాస్టిక్ (ఎఫ్‌ఆర్‌పీ) విడి భాగాలను సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో శ్రీసిటీలో తొలిసారిగా ఏర్పాటైన 8 పరిశ్రమల్లో బీఎఫ్‌జీ ఒకటి. బీఎఫ్‌జీ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ అయిన బీఎఫ్‌జీ ఇండియా.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు నాణ్యమైన, ప్రపంచస్థాయి ఎఫ్‌ఆర్‌పీ విడి భాగాలను అందిస్తోంది.శ్రీసిటీ సెజ్‌లో ఉన్న బీఎఫ్‌జీ ఇండియా 2009 నుంచి పవన శక్తి, నిర్మాణం, రవాణా వంటి వివిధ రంగాల్లో ఉన్న పరిశ్రమల కోసం ఎఫ్‌ఆర్‌పీ మిశ్రమ ఉత్పత్తులు, ప్రత్యేక ఆకృతుల నిర్మాణాలను తయారు చేస్తోంది.

మెట్రోకోచ్ తయారీ సంస్థలు? ఆల్‌స్టం, బొంబార్డియర్, వోల్వో, ఇండియన్ రైల్వేస్‌కి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్), జనరల్ ఎలక్ట్రికల్?ఎనర్జీ, గమేశ, కొచ్చిన్ షిప్ యార్డ్, థెర్మాక్స్, ఆర్సీఎఫ్, ఎంసీఎఫ్, బెచ్‌టెల్ వంటి సంస్థలకు బీఎఫ్‌జీ ఇండియా సేవలందిస్తోంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్ట్‌లో రైలు పెట్టెలోని ఇంటీరియర్‌లు, టాయిలెట్ క్యాబిన్, ఇంజన్ ముందు భాగాన్ని బీఎఫ్‌జీ సంస్థే సరఫరా చేస్తోంది. ఇచ్చిన పనులను రికార్డు స్థాయిలో 10 నెలల్లో బీఎఫ్‌జీ పూర్తి చేసింది. ప్రాజెక్ట్‌ను ఆకర్షణీయంగా రూపొందించడానికి వివిధ రంగుల ప్యానెల్స్‌ను ఈ కంపెనీ తయారీ చేసింది. ఒక్కోరైలు కోసం 329 రకాల ఎఫ్‌ఆర్‌పీ ప్యానెల్స్ తయారయ్యాయ.ఢిల్లీ మెట్రో రోలింగ్ స్టాక్(కోచెస్) కోసం బొంబార్డియర్ ట్రాన్స్‌పోర్టేషన్‌తో దాని వ్యూహాత్మక సరఫరాదారుగా ఇంటీరియర్స్, ఫ్రంట్ ఎండ్‌లు, డ్రైవర్ క్యాబ్‌లతో సహా ఎఫ్‌ఆర్‌పీ విడి భాగాలను బీఎఫ్‌జీ ఇండియా సరఫరా చేస్తోంది. చెన్నై, కొచ్చి, మెట్రో ప్రాజెక్ట్‌ల మెట్రో రోలింగ్ స్టాక్ కోసం సైడ్ వాల్స్, సెంట్రల్ సీలింగ్‌లు, లేటరల్ సీలింగ్‌లు, గ్యాంగ్‌వే విభజనలు, క్యాబ్ విభజనలతో సహా వివిధ భాగాలను శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ ఇండియాకు బీఎఫ్‌జీ సరఫరా చేస్తోంది.

# ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లు

విజయవాడ, ఫిబ్రవరి 16, (న్యూస్ పల్స్)పర్యావరణంతో పాటు భూగర్భ జలాలకు ప్రమాదకరంగా తయారైన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి.. వాటిని రోడ్ల నిర్మాణంలో ఉపయోగించేలా రీసైక్లింగ్ చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. నియోజకవర్గానికి ఒకచోట ఈ తరహా రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేయబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా 160 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు గ్రామాల ఎంపిక సైతం పూర్తయింది.పట్టణాల తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఇంటినుంచీ నేరుగా చెత్త సేకరణ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇలా సేకరించిన చెత్తను ఆయా గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న చెత్త సేకరణ కేంద్రాల (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల)లో ప్లాసిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరు చేసి ఉంచుతారు.గ్రామాల వారీగా ఇలా వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వారానికి ఒకటి లేదా రెండు విడతలుగా ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించేలా ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ప్రతివారం రూట్ల వారీగా ఆ వాహనంతో అన్ని గ్రామాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తారు. అనంతరం ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను మెషిన్ల సాయంతో బండిల్స్ రూపంలో అణచివేసి.. ఆ తర్వాత చిన్నచిన్న ముక్కలు ముక్కలుగా మార్చి నిల్వ చేస్తారు. ప్లాస్టిక్ బాటిల్స్ వంటివి మట్టిలో కలవడానికి కనీసం 240 సంవత్సరాలు పడుతుంది. ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షం నీటిని భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడుతుంటాయి. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో పీఎంజీఎస్‌వై (గ్రామీణ సడక్ యోజన) కింద చేపట్టే రోడ్ల నిర్మాణంలో కంకరతో పాటు కొంతమేర ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.ప్లాస్టిక్ కవర్లు వంటి వాటిని సిమెంట్ పరిశ్రమలలో మండించడానికి ఉపయోగించేలా ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే రీసైక్లింగ్ యూనిట్లలో సిద్ధం చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల నిర్మాణంలో ఉపయోగించాల్సి ఉంటుంది.రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్డ నిర్మించే కాంట్రాక్టర్లకు ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించే ఆలోచన చేస్తున్నారు. రానున్న రోజుల్లో రోడ్ల నిర్మాణంలో వీటి వాడకం పెరిగే పక్షంలో జిల్లాల వారీగా ప్రత్యేక వేలం కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 2021 అక్టోబర్ నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 232 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. వాటిలో స్థానికంగా అమ్మడానికి వీలున్న వాటిని గ్రామ పంచాయతీల స్థాయిలోనే చిరు వ్యాపారులకు అమ్మేశారు.అమ్మకానికి పనికి రాని ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించని రీతిలో నాశనం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గ్రామాల్లో సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్ల నిర్మాణం లేదా సిమెంట్ పరిశ్రమలో మండించడానికి ఉపయోగించేలా రీసైక్లింగ్ ప్రాసెస్ చేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

## టీడీపీ నేతల గృహనిర్బంధం

కడప టిడిపి, వైసిపి నేతల మధ్య సవాల్, ప్రతి సవాళ్ల నేపథ్యంలో కడపలో ఉద్రిక్తత నెలకొంది. టిడిపి నేతలు శ్రీనివాసులు రెడ్డి, హరిప్రసాద్ లను పోలీసులు హౌజ్ అరెస్టు చేసారు. వైసిపి నేతల సవాళ్లు విసరడంతోనే బహిరంగ చర్చకు సిద్ధమయ్యామని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసుల రెడ్డి అన్నారు. సెవెన్ రోడ్స్ లో బహిరంగ చర్చకు అనుమతించక పోతే.. మా ఇంటి దగ్గర కే వైసిపి నేతలను రమ్మనండి. మేము శాంతి భద్రతల సమస్య తీసుకు రావడం లేదు.. శాంతియుతంగా కడప నగర అభివృద్ధి పై చర్చిస్తామని అన్నారు..

# ఎన్టీఆర్ వంద రూపాయిల కాయిన్ లక్ష్యం...

## ఆ సామాజిక వర్గం కోసమేనా

గుంటూరు, ఫిబ్రవరి 16, వంద రూపాయల నాణెం పై త్వరలో నందమూరి తారక రామారావు బొమ్మను ముద్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తెలుగు రాష్ట్రాలతోపాటుగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలుగు వారిని ఓన్ చేసుకునే పనిలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. 100 రూపాయల కాయిన్‌పై ఎన్టీఆర్ బొమ్మ ముద్రించే ఆలోచన వెనుక ఆయనకు గుర్తింపు ఇవ్వడంతోపాటు రాజకీయంగా కూడా లాభిస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. తెలుగు ప్రజలకు బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు పొందిన నందమూరి తారక రామారావు, అటు సిని ఇండస్ట్రీలో ఇటు రాజకీయంగా ప్రత్యేక గుర్తింపు పొందారు. దీంతో ఆయన పేరుతోపాటు బీజేపీ పేరు గట్టిగా శాశ్వతంగా గుర్తుండిపోయే కార్యక్రమాన్ని తలపెట్టాలని కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ భావిస్తున్నట్లుగా చెబుతున్నారు. దీంతో ఈ వ్యవహారం పై ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుందిగతంలో జూనియర్ ఎన్టీఆర్‌తో అమిత్ షా చర్చలు జరిపారు. ప్రత్యేకంగా డిన్నర్‌కు ఆహ్వానించి మరి జూనియర్ ఎన్టీఆర్‌తో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు అమిత్ షా. కేంద్రంలో అత్యంత కీలక వ్యక్తి అయిన అమిత్ షా రెండు గంటలపాటు జూనియర్ ఎన్టీఆర్‌తో చర్చలు జరపటం, భోజనం కూడా చేయటం సర్వత్రా చర్చ జరిగింది. అది కూడా ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీతో పొత్తులో ఉండగా, అమిత్ షా వంటి కీలక నేత జనసేనానికి సంబంధం లేకుండా కేవలం ఎన్టీఆర్‌ను మాత్రమే ఆహ్వానించి చర్చించారు. అయితే అదంతా ఆర్ ఆర్ ఆర్ విజయవంతంలో భాగంగానే జరిగిందని ఎన్టీఆర్ సన్నిహిత వర్గాలు ప్రచారం చేశాయి. నిజంగానే ఆర్ ఆర్ ఆర్ విజయంలో భాగం అయితే రాంచరణ్, రాజమౌళిని అమిత్ షా ఎందుకు ఆహ్వానించలేదనే చర్చ కూడా అప్పట్లో జరింగింది. అమిత్ షాతో సమావేశంపై జూనియర్ ఎన్టీఆర్ కూడా ఎటువంటి ప్రకటన చేయలేదు. దీనిపై బీజేపీ మాత్రం రకరకాల ప్రకటనలు చేసింది. ఏపీ నాయకులు మాట్లాడుతూ... ఇద్దరి సమావేశంలో రాజకీయాలపై చర్చ జరగకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీలో ఇప్పటికే నందమూరి తారకరామారావు వారసురాలు దగ్గుబాటి పురంధీశ్వరికి పెద్ద పీట వేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి భారతీయ జనతా పార్టీలో పురంధీశ్వరికి ప్రత్యేక గుర్తింపు, ఇవ్వటంతోపాటుగా కీలక పదవులు కూడా కేటాయించారు. మాజీ కేంద్రమంత్రిగా కూడా పని చేసిన పురంధీశ్వరి పార్టీలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. ఇప్పుడు నందమూరి తారక రామారావుకు ప్రత్యేక గుర్తింపుగా వందరూపాయలు నాణెంపై ఆయన బొమ్మను ముద్రించేందుకు యోచిస్తుండటం చర్చకు దారి తీసింది. ఎన్టీఆర్‌కు, ఆయన కుటుంబానికి బీజేపీలో ఎక్కువ ప్రాదాన్యత ఇస్తున్నారనే సిగ్నల్ పంపేందుకు ఇలా చేస్తున్నారనే విశ్లేషణలు గట్టిగా వినిపిస్తున్నాయి.ఇప్పటికే నందమూరి తారక రామారావుకు భారత రత్న అవార్డు ఇవ్వాలనే డిమాండ్ పెద్ద ఎత్తున వినిపిస్తోంది. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా చాలా సార్లు రామారావుకు భారత ఇవ్వాలని వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్‌లో సైతం తారక రామారావు విగ్రహం ఏర్పాటు చేశారు. ఇక మిగిలింది భారత రత్న మాత్రమే అనుకుంటున్న తరుణంలో వంద నాణెంపై ఎన్టీఆర్ బొమ్మ అంశం తెర మీదకు వచ్చింది. కేంద్రంలోని బీజేపి రాజకీయ వ్యూహంలో భాగంగానే ఈ అంశం తెర మీదకు తెచ్చిందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# క్యాపిటల్ కహానీకి ఫుల్ స్టాప్ ఎప్పుడు

విజయవాడ, ఫిబ్రవరి 16, (న్యూస్ పల్స్)రాజధాని వ్యవహారం సర్దుమణిగింది అనుకున్న ప్రతిసారీ ఏదో రూపంలో రాజుకుంటూనే ఉంది. తాజాగా బెంగళూరులో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కేపిటల్ సిటీపై చేసిన వ్యాఖ్యలు ఈసారి దుమారాన్ని రేపుతున్నాయి. కర్నూలు, గుంటూరు రాజధాని కాదని.. విశాఖపట్నం రాజధానిగా నిర్ణయించామన్నారు బుగ్గన. వెంటనే లైన్‌లోకి వచ్చిన విపక్షాలు అంటే మూడు రాజధానులు కూడా మీ విధానం కాదా అంటూ విమర్శల బాణాలు ఎక్కుపెట్టాయి. మా విధానం మూడు రాజధానులే చట్టం కూడా తీసుకొస్తామని సజ్జల రామకృష్ణారెడ్డి క్లారిటీ ఇచ్చేశారు. అయినా సవాళ్లు మాత్రం కొనసాగుతున్నాయి.మూడు రాజధానులే మా విధానం అని బిల్లు పెట్టినప్పుడు.. అనంతరం సాంకేతిక కారణాలతో వికేంద్రీకరణ చట్టం రద్దు చేసినప్పుడు గంటల కొద్దీ అసెంబ్లీలో ప్రసంగించిన ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ లేటెస్టుగా బెంగళూరులో చేసిన హాట్ కామెంట్స్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది.త్రీ కేపిటల్స్ సమాచారలోపమని.. రాజధానిగా విశాఖనే నిర్ణయించామని బుగ్గన చెప్పిన ఒక్క మాటను ఏపీలోని విపక్షాలు ఆయుధంగా మలుచుకున్నాయి. ఇంతకాలం మూడు రాజధానులు అంటూ మూడు ప్రాంతాల్లో చెప్పిన వైసీపీ తన విధానంపైనా మడమతిప్పిందా అంటూ నోటికి పనిచెప్పారు. విశాఖ రాజధాని ఎవరూ కోరుకోవడం లేదంటున్న లెఫ్ట్ తో పాటు జనసేన పార్టీలు వైసీపీకి ఓపెన్ సవాల్ విసిరాయి.విధానం మారలేదు.. మూడు రాజధానులపై మా నినాదం కూడా మారదు అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన సజ్జల.. మంత్రి బుగ్గన మాటలను సరిగ్గా అర్థం చేసుకోలేదన్నారు. మీరు సవాళ్లు చేయడం ఏంటి.. తమ ఎన్నికల అజెండాలో రాజధాని అంశం కూడా ఉంటుందని స్పష్టత ఇచ్చింది వైసీపీ. అంతేకాదు కోర్టు తీర్పులకు అనుగుణంగానే సీఎం విశాఖ వెళతారంటూ కూడా స్పష్టత ఇచ్చింది వైసీపీ.ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న రాజధాని వ్యవహారం రాజకీయ పార్టీలకు ఆహారంగా మారింది. కేపిటల్ కహానీ సజీవంగా ఉంచి ఎంతోకొంత లబ్ధి పొందే ప్రయత్నంలో అన్ని పార్టీలున్నాయా? అనే విషయం తేలాల్సి ఉంది.

# లోకేష్ వర్సెస్ రోజా...




తిరుపతి, ఫిబ్రవరి 16, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఏపీ పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఏపీ సీఎం జగన్ వర్సెస్ లోకేష్ వర్సెస్ గా ఉన్న రాజకీయం, తాజాగా లోకేష్ వర్సెస్ రోజాగా మారుతోంది. తనపై చేస్తున్న విమర్శలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంత్రి రోజాను డైమాండ్ రాణి, జబర్దస్త్ ఆంటీ అని లోకేష్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ శ్రేణుల్లో అగ్గి రాజేశాయి. నగరిలో ఓవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ శ్రేణులు ఆందోనళకు దిగుతున్నాయి.మంత్రి రోజా సైతం నారా బ్రాహ్మణి, నారా భువనేశ్వరిపై వ్యాఖ్యలు చేయడంతో వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయింది. మంగళవారం నాడు టీడీపీ మహిళా నేతలు నగరిలో రోజా ఇంటి వద్దకి వెళ్లి చీర, గాజులు., పసుపు కుంకుమ ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో మంత్రి రోజా ఇంటి వద్ద కొంతసేపు హైడ్రామా నడించింది. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని టీడీపీ నాయకులను అక్కడ నుంచి పంపివేశారు. బుధవారం ఉదయం మరోసారి టీడీపీ, వైసీపీ క్యాడర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ మాటల యుద్ధం మొదలైంది.ఈ తరుణంలో వైసీపీ మహిళా నాయకురాళ్లు ఒక్కడుగు ముందుకు వేసి ఖబర్దార్ లోకేష్, భాను ప్రకాష్.. మమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే యువగళం పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ నాయకులు మహిళలు నగిరి టవర్ క్లాక్ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగి ధర్నా కార్యక్రమం చేపట్టారు. మంగళవారం జరిగిన సంఘటనపై మంత్రి రోజా ఇంటి వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపు, చీరలు గాజులు ఇవ్వడంపై వైసీపీ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ మహిళా నేతలు అంతటితో ఆగక నగిరి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భాను ప్రకాష్, లోకేష్ చిత్రపటాలపై చీపుర్లతో, చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. మా జోలికొస్తే ఖబర్దార్ లోకేష్, భాను ప్రకాష్ అంటూ సవాల్ విసిరారు. మంత్రి రోజా ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో భాను ప్రకాష్ పసుపు, చీర పంపడంపై మహిళా నాయకురాలు మేరీ జయరాం మండిపడ్డారు. ఎలాంటి మేనిఫెస్టోలు తెలియని, సరిగ్గా తెలుగు కూడా రాని నేత నారా లోకేష్ అంటూ ఎద్దేవా చేసారు. దమ్ముంటే చంద్రబాబు నాయుడు మా మంత్రి రోజా గారిపై గెలిచి చూపాలని సవాల్ చేశారు. నగిరి నియోజకవర్గంలో భాను ప్రకాష్ ని కాలు కూడా పెట్టరాని పరిస్థితి ఎదురవుతుందని, మాటలు జాగ్రత్తగా రావాలంటూ తీవ్రంగా మండిపడ్డారు. లోకేష్, నగిరి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భాను ప్రకాష్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టడంతో ఆ చిత్రపటాన్ని వైసీపీ శ్రేణులు కాల్చివేశారు.మరోవైపు యువగళం పాదయాత్రలో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో నారా లోకేష్ పర్యటిస్తున్నారు. పిచ్చాటూరులో ఆర్టీసీ బస్సు ఎక్కి, టీడీపీ ప్రభుత్వంలో, వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీల మధ్య వ్యత్యాసాన్ని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు లోకేష్. పేదలు, మధ్యతరగతి వారు ప్రయాణించే ఆర్టీసీ ఛార్జీలను వైసీపీ ప్రభుత్వం మూడు సార్లు పెంచి ప్రజలపై విపరీతమైన భారం వేసిందని లోకేష్ విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆ తర్వాత గాలికి వదిలేశారని, ఆర్టీసి సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలు ఏవీ వారికి ఇంతవరకు దక్కలేదని ఏపీ ప్రభుత్వంపై లోకేష్ విమర్శలు చేశారు.

# అమ్మనాన్నలు నన్ను వదిలి వెళ్లిపోయారు

కడప, ఫిబ్రవరి 16, అమ్మానాన్నలు తనను వదిలేసి వెళ్లిపోయారని.. వాళు ఎక్కడికి వెళ్లారో, ప్రస్తుతం తాను ఏం చేయాలో తెలియక కలెక్టర్ కు ఫిర్యాదు చేసేందుకు వచ్చానని ఓ ఏడేళ్ల బాలుడు ఏడుస్తూ చెబుతున్నాడు. కలెక్టర్ లేరని చెప్పడంతో అక్కడే కూర్చుండిపోయానంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. వైఎస్సార్ కడప జిల్లా వేంపల్లెకు చెందిన బాలుడు రెండు రోజుల కిందట కలెక్టర్ ను కలిసేందుకు కలెక్టర్ కార్యాలయం వద్దకు వెళ్లాడు. ఉదయం నుంచి కలెక్టరేట్ లోని తిరుగుతున్నాడు. అయితే ఈ విషయాన్ని ఎస్సై మధుసూదన్ రెడ్డి గుర్తించారు. వెంటనే బాలుడిని పిలిచి నీ పేరేంటి, నువ్వు ఎవరితో వచ్చావు అంటూ ఆరా తీశారు. బాలుడు ఏమీ మాట్లాడకపోవడంతో ఒకటో పట్టణ ఠాణాకు తీసుకెళ్లారు. ఆ తర్వాత మెల్లిగా నువ్వు కడప ఎందుకు వచ్చావని అడిగారు. ఇంత చిన్న వయసులో ఒంటరిగా తిరగడం ఏంటి, మీ అమ్మా నాన్నలు ఏం చేస్తుంటారంటూ ప్రశ్నించారు.పోలీస్ వాళ్ల ప్రశ్నలకు బాలుడు ఏడవడం ప్రారంభించాడు. ఏడుస్తూనే తన వివరాలు చెప్పాడు. తన అమ్మానాన్నలు తనను వదిలిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయారని, ఎక్కడికి వెళ్లారో కూడా తనకు తెలియని చెప్పాడు. అందుకే కలెక్టర్ కు ఫిర్యాదు చేసేందుకు వచ్చానని.. కానీ కలెక్టర్ సార్ లేకపోవడంతో.. అక్కడే వేచి చూస్తున్నానని వివరించాడు. అది విన్న పోలీసులు అయ్యో పాపం అనుకున్నారు. వెంటనే నువ్వేం బాధ పడకు అంటూ బాలుడికి భరోసాను ఇచ్చారు. బాలుడికి తోడుగా ఓ కానిస్టేబుల్ ను పంపి వేంపల్లెలో ఉన్న తన తాత వద్ద వదిలి పెట్టారు. ఇదే విషయంపై స్పందించిన ఎస్సై... భార్యాభర్తల మధ్య విభేదాలు ఉంటే కూర్చుని పరిష్కరించుకోవాలని, పిల్లలను ఒంటరిగా వదిలేసి వెళ్లడం సరికాదని చెప్పారు. ఇలా వదిలేసి వెళ్లడం వల్ల పిల్లలు చాలా మానసిక వ్యథకు గురవుతారని వివరించారు. ఆ బాలుడి ఏడుపు చూస్తే మనసు తరుక్కుపోయిందని అన్నారు. కొన్ని రోజుల క్రితం ఆరేళ్ల పిల్లాడు ఓ డాక్టర్‌కు చెప్పిన విషయం వైరల్‌గా మారింది. హైదరాబాద్‌కు చెందిన ఓ చిన్నారి. "నేను ఎక్కువ కాలం బతకను. ఈ విషయం అమ్మ నాన్నకు చెప్పకండి. బాధ పడతారు" అని ఓ వైద్యుడికి చెప్పాడు. ఇది విన్న ఆ వైద్యుడి నోట మాట రాలేదు. "ఆరేళ్ల పిల్లాడేనా ఇలా మాట్లాడేది" అని ఆశ్చర్యపోయాడు. ఆ చిన్నారికి క్యాన్సర్ వచ్చింది. ఇదే విషయాన్ని ఆ డాక్టర్‌తో చెప్పాడు. "నేను ఆరు నెలల కన్నా ఎక్కువ బతకను. నాకున్న లక్షణాలను బట్టి ఇది క్యాన్సర్ అని గూగుల్‌లో వెతికి తెలుసుకున్నా. ఈ విషయం అమ్మనాన్నలకు తెలియదు. మీరూ చెప్పకండి. నా చివరి రోజుల్లో వాళ్లు ఆనందంగా చూడాలని కోరుకుంటున్నా" అని ఆ వైద్యుడికి చెప్పాడు ఆ ఆరేళ్ల చిన్నారి. క్యాన్సర్ మహమ్మారి ఆ బాలుడిని బలి తీసుకున్నాక కానీ...ఆ వైద్యుడు ఎవరికీ చెప్పలేదు. ఆ చిన్నారికి ఇచ్చిన మాట నిలబెట్టుకోడం కోసం ఆ బాధను అలా గుండెల్లోనే దాచుకున్నాడు. ఆ చిన్నారి మరణించాక... ట్విటర్‌లో ఈ కన్నీటి కథను పోస్ట్ చేశారు. వరుస ట్వీట్‌లతో నెల రోజుల క్రితం అసలు విషయం అంతా చెప్పారు. ఆయనె చెప్పిన వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన దంపతులకు ఒకే ఒక కొడుకు ఉన్నాడు. వయసు ఆరేళ్లు. చాలా రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఓ హాస్పిటల్‌కు తీసుకెళ్లి టెస్ట్‌లు చేయించారు. అప్పుడే ఆ బాబుకి క్యాన్సర్ ఉందని తేలింది. ఇది విని తల్లిదండ్రులు ఎంతో కుమిలిపోయారు. ఏం జబ్బు వచ్చిందో ఆ చిన్నారికి తెలయనీయకుండా జాగ్రత్తపడ్డారు. మందులు వాడారు. కానీ...ఆ చిన్నారి మాత్రం తనకు ఇస్తున్న మెడిసిన్ ఏంటో గూగుల్‌లో వెతికాడు. తనకు క్యాన్సర్ ఉందని అర్థం చేసుకున్నాడు.

# ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

## ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్

కడప కడప నగరంలో ఈ నెల 19 న ఆదివారం నిర్వహించనున్న ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఆదేశించారు. గురువారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలు లో ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్.పి సమీక్ష నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకూ జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ.. కడప నగరంలోని 11 పరీక్షా కేంద్రాలలో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. 11 కేంద్రాల ను నాలుగు రూట్లుగా విభజించి బందోబన్త్ ఏర్పాటు చేయాలన్నారు.అన్ని విభాగాల సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలి.పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద తప్పక సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి.అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలి.మొబైల్స్ , ఇతర డిజిటల్ పరికరాలుఅనుమతించకూడదు.మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం.ప్రతి సెంటర్ నందు పోలీసు సిబ్బందితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్ ) తుషార్ డూడి ఐ.పి.ఎస్, వై.వి.యు ప్రొఫెసర్, రీజియన్ కో ఆర్డినేటర్ డా.రఘునాధ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బి. రాజా ప్రభాకర్, ఆర్.ఐ సోమశేఖర్ నాయక్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విధులలో అలసత్వం వద్దు......

## నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

శ్రీశైలం శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల క్షణమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టమని, సుమారు 2,400 మంది పోలీసులతో పటిష్ట భద్రత చేపట్టమని నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి వెల్లడించారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి మీకు కేటాయించిన ప్రదేశం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలని బ్రీఫింగ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ భద్రత ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బందోబస్తుకు ఒక అడిషనల్ ఎస్పీ 13మంది డిఎస్పీలు ,52 మంది సిఐలు ,120 మంది ఎస్ఐలు, 954 మంది ఏఎస్ఐ మరియు హెడ్ కానిస్టేబుల్ , 106 మహిళా సిబ్బంది ,464 మంది హోంగార్డులు, 100 మంది స్పెషల్ పార్టీ బృందాలు, డాగ్ స్కాడ్ బృందాలు,మఫ్టీ పోలీస్ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్థించాలని బందోబస్తు విధులలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలియజేసారు. ఎక్కడైనా సమస్య ఉన్నచో పోలీస్ సిబ్బంది సత్వరమే స్పందించాలని ఆదేశించారు ఆంధ్రప్రదేశ్ నుండే కాక కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ తమిళనాడు మొదలగు రాష్ట్రాల నుండి కూడా శ్రీశైలంనకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.పాతాళ గంగ ఘట్ల దగ్గర స్నానం అనుసరించడానికి వచ్చే భక్తులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా గజ ఈతగాళ్లను నియమించామని తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ కు చెందిన వాహనాలను ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంతంలో ,తెలంగాణ ,కర్నాటకకు చెందిన వాహనాలను మేకల బండ వెనక ప్రాంతంలో ,టూరిస్ట్ వాహనాలను మేకల బండ ప్రక్కన గల ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని,కార్లకు టెంపుల్ వెనక భాగంలో ,ఓల్డ్ హెలిపాడ్ ,స్కూల్ మరియు నిత్య అన్నదాన ప్రక్కన ,కమ్మ సత్రం వెనకాల పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్. రమణ ,ఆత్మకూరు డిఎస్పి వై శృతి ,స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు బందోబస్తు వచ్చిన సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

# పంటలకు పగటిపూట కరెంట్ ఇవ్వండి

ఐనవోలు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి గురువారం ఐనవోలులోని 133 కేవి సబ్ స్టేషన్ లో ట్రాన్స్ కో ఏఈ తోట ఐలయ్య ను కలిసి వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై వివరాలు తెలుసుకున్నారు. ఏసీడీ, ఎఫ్ సీ ఏ ఛార్జీలు వసూలు చేయకూడదని మినిట్స్ లో రాసి అధికారులకు చెప్పాలని వివరించారు. రైతులకు కరెంట్ ఎప్పుడొస్తుందో వారం ముందే షెడ్యూల్ ఇవ్వాలని సూచించారు. రాత్రిపూత కరెంటుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. పగటిపూట కరెంటు ఇవ్వాలని అన్నారు. రేవంత్ సూచలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ చెప్పారు. ఆరిటీజన్ కార్మికుల సమస్యలను ఉద్యోగి శ్రవణ్ రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనాలు, కార్మికులను పర్మినెంట్ చేసేలా చూడాలని వినతి చేసారు.

# విద్యుత్ అధికారుల మెరుపు దాడులు

పల్నాడు పల్నాడు జిల్లా గురజాల మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అధికారులు మెరుపు దాడులు జరిపారు. దాదాపు యాభై ప్రత్యేక బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. దాడుల్లో పలువురు విద్యుతు చౌర్యం చేస్తున్నట్లు గుర్తించారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న 106 మందికి 5.41 లక్షలు అపరాధ రుసుం విధించారు.

# ఆలయ ప్రతిష్టాపనలో పాల్గొన్న మంత్రి జగదీష్

సూర్యాపేట సూర్యాపేట మండలం యండ్ల పల్లి గ్రామంలో శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి ,కోదండరామ స్వామి సమేత ఆలయ ప్రతిష్టపన మహోత్సవం లో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ బిక్షం,ఇతర నాయకులు..గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు...

# జహీరాబాద్ లో కేంద్ర మంత్రి పర్యటన

సంగారెడ్డి సంగారెడ్డి జిల్లా లో కేంద్ర మంత్రి పరిషోత్తం రూపాల రెండో రోజు పర్యటన గురువారం కొనసాగింది. జహీరాబాద్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా న్యాల్ కల్ మండలం గాంగ్వార్ లో భాజపా దళిత నాయకుడు మల్లేష్ ఇంట్లో కేంద్ర మంత్రి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మండల భాజపా ముఖ్య నాయకులతో చిట్ చాట్ నిర్వహించారు. అక్కడి నుంచి నారాయణఖేడ్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

## స్వచ్ఛంద సంస్థలు,జన వికాస్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు

కడప జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ ఎం డీ తాహిర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు కడప నగరంలో పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ మన్సూర్ అలీఖాన్ ,రాష్ట్ర సలహాదారులు నూనె నాగేష్, పీవీ రమణ,డాక్టర్ శ్రీనివాసులు,రాష్ట్ర కార్యదర్శి యునుస్ బాషాలు తెలియజేశారు.ఈరోజు మారుతీ నగర్ లో ఉన్న సమితి కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మా అధ్యక్షుడు జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని స్వచ్ఛంద సంస్థలు కలసి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఇందులో భాగంగా రేపు ఉదయం కొన్ని వృద్ధ ఆశ్రమాలలో,అనాథ పిల్లల వసతి గృహాలలో అల్పాహారం మరియు పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని అలాగే బృహదా బ్లడ్ బ్యాంక్ నందు ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అలాగే మధ్యాహ్నం నగరంలోని అన్ని ఆశ్రమాలలో,నిరాశ్రయుల వసతి గృహాలలో,ఆశ నిలయం మూగ చెవిటి వసతిగృహంలో మానసిక వికలాంగుల కేంద్రంలో రోడ్లపై ఉన్న నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని అలాగే వస్త్రదాన కార్యక్రమంలు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం,మొక్కలు నాటే కార్యక్రమం అలాగే క్రీడలకు ప్రోత్సాహం కోసం పోలీస్ స్పోర్ట్స్ గ్రౌండ్ నందు తాహీర్‌ప్రీమియర్ లీగ్ సెషన్ -3 క్రికెట్ ట్రోఫీ కూడా ఉంటుందని వారు తెలియజేశారు.రక్త దాతలు ఎవరైనా ఉంటే రమేష్ హోల్ ఎదురుగా ఉన్న బృహదా బ్లడ్ బ్యాంక్ లో జరిగే ఉచిత రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతంచేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.జన వికాస్ అభిమానులు అందరు ప్రతి ఒక్కరు కూడా ప్రతీ కార్యక్రమంలో పాల్గొనవచ్చున్నారు.

# త్రిపురలో ముగిసిన పోలింగ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16, (న్యూస్ పల్స్)త్రిపురలో పోలింగ్ ముగిసింది. ఇప్పటికే రెండు రౌండ్లు పూర్తయ్యాయి. 73%కిపైగా ఓటు శాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 60 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉంది. ఈ సారి కూడా విజయం తమదే అన్న ధీమాతో ఉన్నాయి పార్టీ శ్రేణులు. ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా....ప్రజలు మరోసారి బీజేపీకే పట్టం కడతారని అన్నారు. దాదాపు 30 ఏళ్ల పాటు సిపిఎం పాలనలో ఉన్న త్రిపురలో...2018లో అధికారం మారిపోయింది. అసలు అక్కడ ఉనికే లేని బీజేపీ ఆ ఎన్నికల్లో పోటీ చేసింది. అయినా...60 సీట్లలో 36 చోట్ల విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్‌కు ఎక్కువగానే సీట్లు వచ్చినప్పటికీ ఇండిజీనీయస్ ప్రోగ్రేసివ్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్టీ)తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే..పూర్వ వైభవం కోసం ప్రయత్నం చేస్తున్నసిపిఎం ఈ సారి కాంగ్రెస్‌తో కలిసి పోటీలోకి దిగింది. అంతకు ముందు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన మాణిక్ సర్కార్‌తో విస్తృతంగా ప్రచారం చేయించింది. మొత్తం 60 సీట్లలో 47 చోట్ల సిపిఎం పోటీ చేయగా...మిగతా 13 చోట్ల కాంగ్రెస్‌కు అవకాశమిచ్చింది. 2018లో సిపిఎం 18 సీట్లు మాత్రమే సాధించింది. అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఒక్క చోట కూడా గెలవలేదు. అందుకే ఈ సారి సీపీఎంతో కలిసి ఎన్నికల బరిలోకి దిగింది. ఇక్కడ విచిత్రం ఏంటంటే..కేరళలో సిపిఎం, కాంగ్రెస్ ప్రత్యర్థులుగా ఉంటే...త్రిపురలో మాత్రం ఈ సీన్ అంతా మారిపోయింది. ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించాలని చూస్తున్న బీజేపీ ఓటర్లపై హామీల వర్షం కురిపించింది. అనుకూల్ చంద్ర స్కీమ్‌లో భాగంగా రూ.5 కే అందరికీ భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు జేపీ నడ్డా. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు అభివృద్ధి విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఈ సారి మేనిఫెస్టోలో మరెన్నో ఆసక్తికరమైన అంశాలు చేర్చామని, అవన్నీ అభివృద్ధికి తోడ్పడేవే అని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి చూపుతారని చెప్పిన నడ్డా...యువతను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు వివరించారు. మేనిఫెస్టోని ఉద్దేశిస్తూ "ఇది కేవలం కాగితం కాదు. ప్రజల పట్ల మాకున్న నిబద్ధతకు నిదర్శనం" అని తేల్చి చెప్పారు నడ్డా. ఒకప్పుడు త్రిపుర పేరు చెబితే హింసాత్మక వాతావరణమే గుర్తొచ్చేదని... ఇప్పుడు ఈ రాష్ట్రం శాంతి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

## నేతి మహేష్ ఆధ్వర్యంలో వేలాదిమంది భక్తులకు అన్నదాన కార్యక్రమం

శ్రీశైలం శ్రీశైల భ్రమరాంబిక శివరాత్రి ఉత్సవాలలో భాగంగా, శ్రీ శరణ బసవేశ్వర సదాశివయ్య అన్న సత్రములో ప్రతిరోజు వేలాదిమంది, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు శివరాత్రి ఉగాది పురస్కరించుకొని లక్షలాదిమంది, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సత్రం దాత ఆంధ్ర తెలంగాణ వీరశైవ అధ్యక్షుడు (నేతి మహేష్) ఆధ్వర్యంలో జరుగుచున్నది.కమిటీ సభ్యులు బసవరాజ్ జంకండి, (కర్ణాటక )సంగారెడ్డి బీదర్, కర్ణాటక (మేనేజ్మెంట్) నాగరాజు, సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజా ఉద్యమాలను బలపరచండి

**సిపిఎం ఉద్యమాఅభివృద్ధికి విరాళాలు ఇవ్వండి**

**సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్**



బద్వేలు , బద్వేల్ నాలుగు రోడ్ల కూడలి నందు గురువారం సిపిఎం పార్టీ ప్రజా ఉద్యమాలను ఉద్యమ అభివృద్ధికి విరాళాలు ( మాస్ క్యాంపియన్ ) ను కడప జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఉ చంద్రశేఖర్ గారు ప్రారంభించారు . అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం , ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం జరిగే ప్రజా ఉ ద్యమాలను బలపరచాలని అన్నారు , రైతు , కార్మిక , వ్యవసాయ కార్మిక , మహిళ , దళిత , బలహీన వర్గాల , యువత , విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి స్థానిక సిపిఎం శాఖ నుండి అఖిలభారతస్థాయి వరకు మహాసభలు జరుపుకొని ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి కార్యక్రమాలు రూపొందించడం సిపిఎం పార్టీ విశిష్టత కడప జిల్లాలో అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టి ప్రజలవేన్నంటి నిలిచింది, కరోనా సమయంలో మానవతావాదులు ఇచ్చిన సహకారంతో అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు , వామపక్ష , ప్రజాతంత్ర , లౌకిక శక్తులను కలుపుకుంటూ కమ్యూనిస్టు ఉన్నత విలువలతో కూడిన రాజకీయాలను చేపడుతుందన్నారు సిపిఎం చేసే ఉద్యమాలను బలపరచవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము మీరుఇచ్చే ప్రతి రూపాయి ప్రజా ఉద్యమానికి ఖర్చు చేసి మీ డబ్బుకు మరింత గౌరవాన్ని పెంచుతామని వినయ పూర్వకంగా మీ సహాయాన్ని అర్థిస్తున్నామని అన్నారుఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ బద్వేల్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు చాంద్ బాషా , పట్టణ కమిటీ సభ్యులు మస్తాన్ , రమణయ్య , మోక్షమ్మ , సిపిఎం నాయకులు సుబ్బరాయుడు , బాబయ్య సుబ్బరాయుడు , వెంకటసుబ్బయ్య , తదితరులు పాల్గొన్నారు

## కర్నూలు శాసన సభ్యులును మర్యాదపూర్వకంగా కలిసిన వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్

ఎమ్మిగనూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్, కర్నూలు శాసన సభ్యులు హాఫిజ్ ఖాన్ గారిని మర్యాద పూర్వకంగా కలసిన ఎమ్మిగనూరు పట్టణ మైనార్టీ నాయకులు వక్ఫ్ బోర్డు ఉపాద్యాక్షులు రియాజ్ ఆహ్మద్, జామియా మసీదు ప్రెసిడెంట్ కాశీం బేగ్, కో ఆపరేటివ్ స్టోర్ చైర్మన్, పట్టణ జె సి ఎస్ కన్వీనర్ షబ్బీర్ ఆహ్మద్, కౌన్సిలర్లు వాహీద్, యిసాక్, కో ఆప్షన్ మెంబర్ అబ్రర్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సయ్యద్ చాంద్, అసెంబ్లీ సోషల్ మీడియా కన్వీనర్ మన్సూర్ బాషా, ఉస్మాన్, మెకానిక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# ఈక్విటీ పార్టిసిపేషన్ ద్వారా మూలధనాన్ని ఎలా పెంచుకోవచ్చు?

హైదరాబాద్ ఫిబ్రవరి 16 ఆలస్యంగా, గ్లోబల్ ఫైనాన్షియల్ మార్కెట్లు ప్రైవేట్ ఈక్విటీ అనే బజ్‌వర్డ్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇది తమ వృద్ధి పథాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని చూస్తున్న కంపెనీలకు మూలధనం యొక్క అత్యంత ప్రభావవంతమైన మూలం. గ్రోత్ క్యాపిటల్ (గ్రోత్ ఈక్విటీ లేదా ఎక్స్‌పాన్షన్ క్యాపిటల్ అని కూడా పిలుస్తారు) అనేది నాటకీయ వృద్ధి సంభావ్యతతో జీవిత-చక్ర పరివర్తన ఈవెంట్‌కు గురవుతున్న పరిపక్వ కంపెనీలలో పెట్టుబడి అవకాశం. కార్యకలాపాల విస్తరణ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశించడం, లాభదాయకమైన కొనుగోళ్లు చేయడం మరియు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం మొదలైనవి.ప్రతిగా, ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడిదారులు గ్రోత్ క్యాపిటల్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా లాభదాయకమైన రాబడిని పొందవచ్చని ఉం క్యాపిటల్ మేనేజ్‌మెంట్ కంపెనీకి చెందిన ఆర్థిక నిపుణులు అంటున్నారు.భారతదేశంలో, అనేక కంపెనీలు గ్రోత్ క్యాపిటల్ స్టేజ్‌లో ముఖ్యమైన ఆస్తులను భద్రపరచడానికి ప్రైవేట్ ఈక్విటీ స్టైల్ స్ట్రక్చర్‌లను అవలంబించాయి. గ్రోత్ క్యాపిటల్ అనేది కంపెనీలు వృద్ధి చెందడానికి మరియు విస్తరించేందుకు సహాయపడే ఒక రకమైన ఫైనాన్సింగ్, నగదు, రుణాలు లేదా ఈక్విటీని అందించడం ద్వారా వారి దీర్ఘ-కాలాన్ని సాధించడంలో సహాయపడతాయి. లక్ష్యాలు.గ్రోత్ దిగుబడులను పొందేందుకు ఒక వ్యూహాత్మక మార్గంఈక్విటీ పార్టిసిపేషన్ అనేది ఎంపికల ద్వారా లేదా ఫైనాన్సింగ్‌కు బదులుగా పాక్షిక యాజమాన్యాన్ని అనుమతించడం ద్వారా కంపెనీ షేర్లను కొనుగోలు చేయడం.మీరు ఆర్థిక మార్కెట్‌లను పరిశీలిస్తే, వృద్ధిని వేగవంతం చేయడానికి నగదును ఉత్పత్తి చేయడానికి తమ షేర్లపై రాబడి కోసం చూస్తున్న వ్యవస్థాపకులకు గ్రోత్ క్యాపిటల్ ఒప్పందాలు గణనీయమైన మొత్తంలో నిధులను అందించగలవని మీరు గ్రహిస్తారు.సంస్థాగత మరియు రిటైల్ పెట్టుబడిదారుల నుండి గ్రోత్ క్యాపిటల్ ఇంజెక్షన్ సాంప్రదాయ వాణిజ్య విక్రయం కంటే ఎక్కువ విలువను అందించగలదనేది కూడా నిరూపితమైన వాస్తవం.ప్రైవేట్ ఈక్విటీ/ జాబితా చేయని షేర్లు ఎందుకు?ప్రైవేట్ ఈక్విటీ అనేది స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇంకా జాబితా చేయబడని కంపెనీలలో పెట్టుబడి అవకాశం. దీని నిధుల మూలాలు వ్యక్తిగత పెట్టుబడిదారుల పూల్స్ లేదా ప్రైవేట్‌గా నిర్వహించబడుతున్న కంపెనీలలో పెట్టుబడి పెట్టే లేదా కొనుగోలు చేసే మ్యూచువల్ ఫండ్స్. ప్రైవేట్ ఈక్విటీ వ్యాపారాలు అత్యంత లాభదాయకంగా ఉంటాయి మరియు అందువల్ల అత్యుత్తమ ప్రతిభను కలిగి ఉంటాయి.వ్యాపారం మరియు పెట్టుబడి-పోర్ట్‌ఫోలియో నిర్వహణ కలయికతో కూడిన ఆ వ్యూహం ప్రైవేట్ ఈక్విటీ విజయానికి ప్రధాన అంశం.ఈక్విటీలో పెట్టుబడి పెట్టడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనందరికీ తెలుసు - సరిగ్గా చేస్తే అది అపూర్వమైన అప్‌సైడ్‌ను అందిస్తుంది. మనలో చాలా మందికి అన్‌లిస్టెడ్ షేర్లలో ఇన్వెస్ట్ చేయడం అనే విషయం తెలియదు .బహుళ ప్రయోజనాలు. అన్‌లిస్టెడ్ షేర్లు అంటే స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఇంకా జాబితా చేయబడని షేర్లు. భారతదేశంలోని వివిధ పెట్టుబడి అవకాశాలలో ప్రస్తుతం ప్రీ-ఐపిఓ కంపెనీలలో (జాబితాలో లేని షేర్లు) పెట్టుబడి ఒక ఆకర్షణీయమైన పెట్టుబడి ఎంపికగా ఉంది.అన్‌లిస్టెడ్ కంపెనీలను వాల్యూయింగ్ చేయడం.స్టాక్ ఎక్స్ఛేంజీలలో జాబితా చేయబడని షేర్ల కంపెనీ విలువను మీరు ఎలా నిర్ధారించగలరు?అత్యంత సాధారణ పద్ధతి పెట్టుబడిదారులు మరియు ప్రమోటర్లు సరసమైన విలువను అంగీకరించడం. ఈ సరసమైన విలువ అనేది పోల్చదగిన కంపెనీలను విశ్లేషించడం, ప్రాధాన్యంగా సన్నిహిత పోటీదారులు లేదా సారూప్య వయస్సు, వృద్ధి పథం మరియు పరిమాణం కలిగిన కంపెనీలను విశ్లేషించడం. సరసమైన విలువలో ప్రైస్-టు-సేల్స్, ప్రైస్-టు-ఎర్నింగ్స్ మరియు ప్రైస్-టు-బుక్ వంటి కొలమానాలు కూడా ఉంటాయి.

# హనుమంత వాహనంపై వేంకటాద్రిరాముడు

తిరుపతి శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన గురువారం ఉదయం శ్రీనివాసుడు శ్రీరాములు వారి అలంకారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉ దయం 8 నుండి 9 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.హనుమంత వాహనం - భగవత్ భక్తి ప్రాప్తి బ్రహ్మోత్సవాలలో ఆరో రోజు ఉదయం స్వామివారు వరదహస్తం దాల్చిన కల్యాణ వేంకటరాముడై హనుమంతునిపై ఆసీనుడై భక్తులను అనుగ్రహించారు. శ్రీవారు త్రేతాయుగంలో శ్రీరాముడై అవతరించాడు. భవిష్యోత్తర పురాణంలోని వేంకటాచల మహత్యంలో శ్రీవారు వేంచేసిన పుట్ట - కౌసల్య, చింతచెట్టు - దశరథుడు, శేషాచలం - లక్ష్మణుడు, పర్వతప్రాంతం - అయోధ్య అని పేర్కొనబడింది. శ్రీరాముడు హనుమంతుని భుజస్కంధాలపై అధిరోహించిన సన్నివేశాలు శ్రీమద్రామాయణంలో ఉ న్నాయి. ఈ ఉత్సవంలో వాహనంగా హనుమంతుడిని, వాహనాన్ని అధిష్ఠించిన కల్యాణ వేంకటరాముడిని దర్శించడం వల్ల భోగమోక్షాలు, జ్ఞానవిజ్ఞానాలు, అభయారోగ్యాలు కలుగుతాయి. కాగా మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు శ్రీవారి కల్యాణమండపంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు స్వర్ణ రథోత్సవము వైభవంగా జరుగనుంది. రాత్రి 8 నుండి 9 గంటల వరకు గజవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

## 18న ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం

నెల్లూరు నెల్లూరు జిల్లా నెల్లూరు టౌన్ ఆర్టీసీ సమీపం ఏనుగు సుందర్ రామిరెడ్డి ఆడిటోరియం నెల్లూరు ప్రెస్ క్లబ్ నందు విలేకరుల సమావేశంలో ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బద్దేపుడి రవీంద్ర మాట్లాడుతూ ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ సీనియర్ న్యాయవాది బైపా అరుణ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మా అసోసియేషన్ వారికి ఆత్మీయ ఘన సన్మానం చేయడం జరుగుతుందని తెలియజేశారు ఈ సమావేశంలో మా అడ్వకేట్స్ యొక్క సమస్యలపై అనగా ఇళ్ల స్థలాల, హెల్త్ కార్డ్ సమస్యలపై చర్చించుకుని పరిష్కార దిశగా ఆలోచిన చేస్తామన్నారు అలాగే మా అసోసియేషన్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిందన్నారు జిల్లా జైల్లో పేదవాళ్లయిన నేరస్తులకు ఉచితంగా బెయిల్ మంజూరులోసహాయ సహకారాలు అందించిందని ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ ఏ సమస్యలు ఉన్న మా అసోసియేషన్ తెలిపాలని అలాగే ప్రతి ఒక్కరు 18 తారీకున జరిగే ఆత్మీయ సమావేశానికి అడ్వకేట్ మిత్రులందరికీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు

# "హెయిర్ కటింగ్ సెలూన్స్ నాయి బ్రాహ్మణులు మాత్రమే నిర్వహించాలి...

**ఏ ఇతర కులాలు మతాలు నిర్వహించకూడదు...**

**రాష్ట్ర నాయి బ్రాహ్మణ సేవ సంఘం డిమాండ్...**

నంద్యాల ఫిబ్రవరి 16 రాష్ట్ర నాయి బ్రాహ్మణ సోదరులకు తెలియజేయడమేమనగా, ఈరోజు మన కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ అయినటువంటి , శ్రీ నారాయణ ప్రకాష్ , మన రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ సిద్ధవటం యానాదయన్న మరియు అన్ని జిల్లాల డైరెక్టర్లు . ఒక మహోన్నతమైనటువంటి జీ.వో కొరకు కృషి చేస్తున్నారు. దీని కొరకు కర్నూలు జిల్లా నుండి గత సంవత్సరం నుండి ఎన్నో సమస్యలు వస్తున్నందువల్ల కర్నూలు జిల్లా నుండి ఎస్ ధన విజయుడు , దీనికి సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి ఒక జీవో తేవాలని చెప్పి ప్రకాష్ అన్న కి శ్రీ యానాదయ్య కి చాలాసార్లు విన్నవించడం జరిగినది. దీనిపై వారు స్పందించి, ఇందులో ముఖ్యంగా మన నారాయణ డైరెక్టర్ ప్రకాష్, మరియు యానాదయన్న , ధన విజయుడు కి హామీ ఇవ్వడం జరిగినది. వారు సంబంధిత అధికారులకు మన యొక్క వృత్తి అయినటువంటి హెయిర్ కటింగ్ సెలూన్స్, పట్టణాల్లో గ్రామాలలో మరియు నగరాలలో నాయి బ్రాహ్మణులు మాత్రమే నిర్వర్తించాల అనే విషయంపై అధికారులపై ఒత్తిడి తెస్తూ పొలిటికల్ గా కూడ ఒత్తిడి తెచ్చి కార్పోరేషన్ సెలూన్ ఇతర కులాల వాళ్ళు గాని, ఇతర మతాలవారు గాని, నిర్వర్తించకూడదు అనే దానిపై మన ప్రకాష్ అన్న చాలా కృషి చేస్తున్నారు .ఇది అతి త్వరలో జీవో తేవడానికి ఆయన మన ముఖ్యమంత్రి తో చర్చించడం జరిగినది.ఈ యొక్క కృషి త్వరగా ఫలించాలి అని ఆ దేవుని కోరుకుంటూ ....... కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం.. మహిళా స్టేట్ వైస్ ప్రెసిడెంట్ నంద్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీమతి గుంతనాల నాగమణివారికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేసుకుంటూ వారికి శు భాభినందనలు.

# పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి...

**సిపిఐ (యంయల్) ఆర్ ఐ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్..**

కోవెలకుంట్ల ఫిబ్రవరి 16 కోవెలకుంట్ల మండలం కలుగోట్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ (యంయల్) ఆర్ ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ, కలుగోట్ల గ్రామంలో యసి కాలనిలో వున్న ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన స్కూల్ గేట్ విరగడానికి సిద్ధంగా వున్న అక్కడి సిబ్బంది గాని ఉపాధ్యాయులు గాని పట్టించుకోకపోవడం చాలా దారుణమని వారన్నారు. అలాగే స్కూల్ పక్కన ఉన్న పాత భవనం కూలడానికి సిద్ధంగా వున్న కూడా అదికూడా పట్టించుకోకపోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రమాదం జరగక ముందే ఇలాంటి వాటిపై ముందుగానే చర్యలు తీసుకోవాలి లేకపోతే అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు పొరపాటున అక్కడికి వెళ్తే జరగరానిది జరిగి తే ఎవరు బాధ్యత వ్యవహరిస్తారని ఆయన అధికారులను సూటిగా ప్రశ్నించారు అందుకే అధికారులు మొద్దునిద్ర వీడి ప్రమాదం జరగక ముందే మేల్కొని వాటిని తొలగించాలని లేని పక్షంలో విద్యార్థులుతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# కోలీవుడ్ పొమ్మంటే టాలీవుడ్ రమ్మంది!



విలన్ వేషాలతో టాలీవుడ్ లో అదరగొడుతోంది వరలక్ష్మి శరత్ కుమార్. తమిళ అగ్రనటుడు శరత్ కుమార్ వారసురాలిగా తండ్రిని మించిన తనయ అని నిరూపిస్తోంది. వరలక్ష్మికి ఒక రకంగా తమిళంలో కంటే తెలుగులోనే ఫాలోయింగ్ అధికంగా ఉంది. ఈ బ్యూటీ నెగెటివ్ షేడ్ పాత్రల్లో ఎనర్జిటిక్ నటనతో కట్టి పడేస్తుంటే తనకు తెలుగు చిత్రసీమ వరుస అవకాశాలిచ్చి ఎంకరేజ్ చేస్తోంది.అందుకేనేమో టాలీవుడ్ పై తన ప్రేమను ఎంత మాత్రం దాచుకోలేదు వరలక్ష్మి. తనకు తెలుగు సినిమాలో వచ్చినట్టు కోలీవుడ్ లో అవకాశాలు రావడం లేదని టాలీవుడ్ తనని ఆదరిస్తోందని కితాబిచ్చేసింది. వరలక్ష్మి శరత్కుమార్ నటించిన 'కొంటూనాల్ భవం' అనే కన్నడ చిత్రంలో నటించింది.దయాళ్ పద్మనాభన్ దర్శకత్వం వహించారు. మార్చి 3న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ లో వరలక్ష్మి పైవిధంగా వ్యాఖ్యానించింది. నేను ప్రధానంగా తెలుగు సినిమాల్లో నటిస్తాను. నా తొలి ఆల్బమ్ 'బోడ బోడి' 2012లో తమిళంలో విడుదలైంది. 2022లో నా తెలుగు సినిమా 'క్రాక్' విడుదలైంది. ఆ ఏడాది తెలుగులో నాకు వచ్చిన స్పందన తమిళంలో రాలేదు. అక్కడ అవకాశాలు వస్తూనే ఉన్నాయి. పారితోషికం చర్చలకు లోబడి ఉంటుంది. అక్కడ ప్రతిభను వారు గౌరవిస్తారు.నేను నటిస్తే సినిమాకు మంచి ఆదరణ లభిస్తుందని వారు భావిస్తున్నారు. తెలుగు సినిమా తమిళం కంటే బాగా ఎక్స్పోజ్ అవుతోంది. నాకు చాలా అవకాశాలను నాన్ స్టాప్ గా ఇచ్చింది.. అని టాలీవుడ్ పై ప్రేమను కురిపించింది.తమిళంలో గౌరవం పెరుగుతుంది:'కొంటూనాల్ భవం' సినిమా తమిళ వెర్షన్ కి ఆదరణ దక్కుతుందని ఆశిస్తున్నాను. తర్వాత తమిళంలో కూడా నాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని భావిస్తున్నాను. ఇందులో మల్లిక అనే పాత్రను పోషించాను. ఒకే రోజు ఒకే ఇంట్లో ఏం జరిగిందన్నది తెరపైనే చూడాలి. ఇది థ్రిల్లర్ చిత్రం. కథ 1980లో జరిగినప్పటికీ స్క్రిప్ట్ ఏ కాలంలో అయినా ఆదరించేదిగా ఉంది.కన్నడలో ఈ చిత్రం ప్రజాదరణ పొందింది. తమిళంలోను ఆడుతుందని ఆశిస్తున్నాను. నా పాత్ర ఇతర సినిమాల్లోలానే కొన్ని పాత్రలను నడిపించే ప్రత్యామ్నాయంగా ఉంటుంది. ఇలాంటి పాత్రలకు వరుసగా నన్ను తీసుకోవడం మానుకోండి. అదే తారాగణంతో నేను తదుపరి చిత్రంలో కూడా కనిపించాను. అదనంగా కొనసాగింపు భాగం పూర్తయ్యే వరకు చిత్రీకరణలో పాల్గొనాల్సి ఉంటుంది" అని తెలిపింది.

# టాప్ లిస్టులో వాల్తేరు వీరయ్యా

టాలీవుడ్ లో ఈ మధ్యకాలంలో సినిమా బడ్జెట్ లు పెరిగిపోతున్నాయి. దానికి తగ్గట్లుగానే హిట్ అయితే వచ్చే సినిమాల కలెక్షన్స్ కూడా గట్టిగానే ఉ ంటున్నాయి. పెద్ద స్టార్స్ అందరూ కూడా పాన్ ఇండియా ఇమేజ్ తెచ్చుకొని యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథలపైన ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు. ఇండియన్ వైడ్ గా ఉన్న మార్కెట్ ని సొంతం చేసుకోవడం ద్వారా భారీ కలెక్షన్స్ రాబట్టే చిత్రాలు చేస్తున్నారు. ఇలా రిలీజ్ చేయడం ద్వారా ఒక్క భాషలో క్లిక్ అయిన నిర్మాతలు పెట్టిన పెట్టుబడి మొత్తం తిరిగి వచ్చేస్తుంది.ఈ లాజిక్ అర్థం చేసుకున్న తర్వాత అందరూ కూడా ఇదే బాట పడుతున్నారు. మీడియం రేంజ్ హీరోలు కూడా యూనివర్సల్ అప్పీల్ ఉన్న పాన్ ఇండియా కథలనే ఎంపిక చేసుకుంటున్నారు. ఇక ఇలాంటి కథలని తెలుగులో కూడా భారీగానే కలెక్షన్స్ వస్తూ ఉండటం విశేషం. ఇప్పటి వరకు తెలుగులో హైయెస్ట్ కలెక్షన్స్ సాధించిన సినిమాలు చూసుకుంటే మొదటి స్థానంలో ఆర్ఆర్ఆర్ ఉంటుంది. ఈ మూవీ ఏకంగా తెలుగు రాష్ట్రాలలో 415 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసింది. రెండో స్థానంలో బాహుబలి 2 నిలిచింది.ఈ మూవీ ఏకంగా 330 కోట్లు కలెక్ట్ చేసింది. మూడో స్థానంలో అల్లు అర్జున్ అల వైకుంఠపురంలో మూవీ సాధించింది. ఈ మూవీ 203 కోట్ల గ్రాస్ ని



తెలుగు రాష్ట్రాల్లో సాధించింది. తరువాత స్థానంలో మెగాస్టార్ వాల్తేర్ వీరయ్య నిలవడం విశేషం. ఈ మూవీ 186.65 కోట్ల గ్రాస్ ని తెలుగు రాష్ట్రాల నుంచి కలెక్ట్ చేయడం విశేషం. ఇది కేవలం తెలుగులోనే రిలీజ్ అయిన సినిమా కావడం మరో ఆసక్తికర విషయం.దీని తర్వాత సరిలేరు నీకెవ్వరు మూవీ 177.10 కోట్ల గ్రాస్ ని కలెక్ట్ చేసింది. దీని తర్వాత స్థానంలో బాహుబలి 175.40 కోట్ల కలెక్షన్ తో నెక్స్ట్ ప్లేస్ లో ఉంది. ఇలా హైయెస్ట్ గ్రాస్ కలెక్షన్ చేసిన సినిమాల జాబితాలో రెండు స్ట్రైట్ తెలుగు సినిమాలు ఉండగా మిగిలినవి పాన్ ఇండియా రేంజ్ సినిమాలు కావడం విశేషం. అయితే వీటిలో పుష్ప లేకపోవడం కొసమెరుపు.

# నాని దసరా బిజినెస్.. దిల్ రాజు ప్లాన్ అదిరిపోయిందిగా

నేచురల్ స్టార్ నాని హీరోగా కీర్తి సురేష్ హీరోయిన్ గా రూపొందుతున్న దసరా సినిమా టీజర్ విడుదలపై సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. నిజానికి దసరా సినిమాలో నాని తన రెగ్యులర్ లుక్ కు పూర్తి విభిన్నంగా కనిపించబోతున్నట్లుగా ఫస్ట్ లుక్ లోనే చెప్పేశారు. మాసిన గడ్డం బొగ్గు గనుల్లో మసితో లుంగీ కట్టుకుని షర్ట్ సగం వేసుకుని మాస్ పాత్రలో నాని కనిపించబోతున్నాడు. టీజర్ లో నానిని చూస్తూ ఉంటే ఆశ్చర్యం కలగక మానదు. నాని లుక్ తో పాటు దర్శకుడు శ్రీకాంత్ టేకింగ్ కంటెంట్ పై కూడా భారీ హైప్ క్రియేట్ అయింది. దాంతో ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరిగిపోయింది. అయితే ఇప్పుడు ఈ సినిమా దిల్ రాజు క్యాంప్ కు చేరిందని తెలుస్తోంది.అసలు నిర్మాత సుధాకర్ చెరుకూరి.. దసరా సినిమా తెలుగు రాష్ట్రాల హక్కులను హోల్ సేల్ గా రూ. 24 కోట్ల భారీ రేటుకు చదలవాడ శ్రీనివాసరావుకు అమ్మేశారు. ఈ లోగా దసరా టీజర్పాటలు రిలీజై దుమ్ము రేపాయి. దీంతో వెంటనే దిల్ రాజు రంగంలోకి దూకారు. ఊహించని ఆఫర్ ఇచ్చి చదలవాడ శ్రీనివాసరావు దగ్గర తెలుగు రాష్ట్రాల హక్కులు కొనేశారని తెలిసింది. చదలవాడ కొన్నదానికి కన్నా నాలుగు కోట్లు ఎక్కువ ఇచ్చి మరి.. తీసుకున్నారట. దీంతో సినిమా రిలీజ్ కు ముందే చదలవాడ ఫుల్ గా లాభపడ్డారు.అలా దిల్ రాజు ఈ చిత్ర థియేట్రికల్ రైట్స్ను సొంతం చేసుకోవడానికి నిర్మాతలకు రూ.28 కోట్లు చెల్లించినట్లుగా తెలుస్తోంది.



ఇప్పుడు ఈ రైట్స్ ద్వారా మరింత లాభం పొందేందుకు..దిల్ రాజు ఏరియా వైస్ గా భారీ ధరకు అమ్మేందుకు ప్లాన్ చేస్తున్నారట. అయితే తన సొంత డిస్ట్రిబ్యూషన్ ఏరియాస్ అయినా నైజం యూఏ మినహా మిగితా ఏరియాస్ కు ఇలా చేస్తున్నారట. దీని ద్వారా తన పెట్టుబడిలో 70 శాతం మొత్తాన్ని రికవరీ చేయమన్నాడు.ఇకపోతే నాని అంతకు ముందు చిత్రం అంటే సుందరానికి తొందరెక్కువ రూ. 22 కోట్లకు అమ్ముడైంది. ఇక ఈ సినిమాను బాలీవుడ్లో అనిల్ తడానీ వంటి పెద్ద డిస్ట్రిబ్యూటర్లు తీసుకొన్నారట. కర్ణాటక నుంచి ఐఖీఉ కేరళ నుంచి ఇ4ఇ ఓవర్ సీస్ ఖష్ట్రజీతీబ ఇలా అన్ని చోట్ల పెద్ద డిస్ట్రిబ్యూటర్స్ రంగంలోకి దిగారని తెలిసింది. మొత్తంగా నాని ఈ దసరా సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్నారు. తనకు నటుడిగా మంచి పేరు తెస్తుందని కమర్షియల్ గా కూడా మంచి హిట్ అవుతుందని భావిస్తున్నారు.

# మహిళల టీ20 ప్రపంచకప్.. దీప్తి శర్మ, మునీబా సూపర్ రికార్డులు

ఇంటర్నెట్ డెస్క్: మహిళల టీ20 ప్రపంచకప్ రసవత్తరంగా సాగుతోంది. దాయాది దేశాలైన భారత్ , పాకిస్థాన్ ప్లేయర్లు రికార్డులు సృష్టించారు.ఒకరేమో బౌలింగ్‌లో కాగా.. మరొకరు బ్యాటింగ్‌లో అదరగొట్టడం విశేషం. ఇంతకీ ఆ ఇద్దరు ఎవరనేగా మీ డౌటు? టీమ్‌ఇండియా క్రీడాకారిణి దీప్తి శర్మ పాక్



బ్యాటర్ మునీబా అలీ ఇంతకీ వీరిద్దరు ఏం సాధించారో తెలుసుకోండి..టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ దీప్తి శర్మ భారత్ తరఫున టీ20ల్లో వంద వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించింది. విండీస్‌పై మూడు వికెట్లు తీయడంతో ఈ ఘనతను అందుకొంది. దీంతో 89 మ్యాచుల్లో 100 వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా రికార్డుకెక్కింది. అంతర్జాతీయంగా తొమ్మిదో బౌలర్ కావడం విశేషం. దీప్తి వెనుకనే పూనమ్ యాదవ్ (98 వికెట్లు) మాత్రమే ఉండగా.. రాధా యాదవ్ (67), రాజేశ్వరి గైక్వాడ్ (58), ఝులన్ గోస్వామి (56), ఏక్తా బిస్త్ (53) మాత్రమే 50 కంటే ఎక్కువ వికెట్లు తీసిన భారత బౌలర్లు. ఇక అంతర్జాతీయంగా విండీస్ క్రికెటర్ అనిసా మహమ్మద్ 117 మ్యాచుల్లో 125 వికెట్లతో అగ్రస్థానంలో ఉంది. నాలుగు మ్యాచుల్లో రెండు విజయాలతో భారత్ సెమీస్ వైపుగా దూసుకెళ్తోంది.మహిళల టీ20 క్రికెట్‌లో ఇప్పటి వరకు 38 సెంచరీలు నమోదు కాగా.. అందులో పాక్ నుంచి ఒకే ఒక్క బ్యాటర్ మునీబా అలీ మాత్రమే ఉంది. తాజాగా ఐర్లాండ్ మీద తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో మునీబా అద్భుతమైన సెంచరీ సాధించింది. 66 బంతుల్లో శతకం నమోదు చేసిన మునీబా.. తొలి పాకిస్థాన్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. తొలి అర్ధశతకం కోసం 40 బంతులను తీసుకొన్న మునీబా తర్వాత చెలరేగిపోయింది. కేవలం మరో 26 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను తాకింది. గతంలో టీ20ల్లో మునీబా అత్యధిక వ్యక్తిగత స్కోరు 43 పరుగులే కావడం గమనార్హం.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**